




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 253 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 20 మే 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 253 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 20 MAY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Prakasam, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


# రాష్ట్రంలో ఉగ్రవాద కదలికలపై అప్రమత్తత అవసరం

- సీఎస్, డీజీపీలకు పవన్ కల్యాణ్ లేఖ
- తీర ప్రాంత జిల్లాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్న పవన్
- రోహింగ్యాలు, ఉగ్రవాద సానుభూతిపరుల ఉనికిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన
- దేశ భద్రత, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టీకరణ



పెన్ పవర్ డెస్క్:జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉగ్రవాద కదలికలు, వారి సానుభూతిపరుల జాడలపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పోలీస్ శాఖ, పరిపాలనా శాఖలకు సూచించారు. ఈ మేరకు పలు సూచనలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికీ, రాష్ట్ర డీజీపీకి లేఖలు రాశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత అనుక్షణం అప్రమత్తంగా ఉండాల్సిన తరుణం వచ్చిందనీ, దీనిపై సంబంధిత శాఖలతో సమన్వయం అవసరమని చెప్పారు. విజయనగరంలో ఒక యువకుడికి ఐఎస్ తో సంబంధాలున్నాయని, పేలుళ్లకు కుట్ర పన్నిన విషయాన్ని తెలుగు రాష్ట్రాల నిఘా వర్గాలు గుర్తించి అరెస్టు చేసిన క్రమంలో మన రాష్ట్ర పోలీసులు మరింత కట్టుదిట్టమైన చర్యలకు ఉపక్రమించాలని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఉగ్రవాద సానుభూతిపరులు, స్లీపర్ సెల్స్, అక్రమ వలసదారులు, రోహింగ్యాల ఉనికిపై, అలాంటివారి కదలికలపైనా అన్ని జిల్లాల అధికారులు తక్షణం అప్రమత్తమై, ఎక్కడైనా ఉగ్ర నీడలు, వారి జాడలు కనిపిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సమగ్ర విచారణ చేపట్టాలని ఆదేశించారు.

ముఖ్యంగా తీర ప్రాంత జిల్లాల పరిధిలో ఈ తరహా కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో సుదీర్ఘమైన సముద్ర తీరం ఉంది. కాబట్టి తీర ప్రాంత నిఘా, తీర ప్రాంత రక్షణపై ప్రత్యేక దృష్టి అవసరం అని ఆ లేఖలో పేర్కొన్నారు. పహల్గామ్ ఉగ్ర దాడులు, తదనంతర పరిణామాలతో దేశ అంతర్గత భద్రతపై తగిన జాగ్రత్తలు తీసుకునే విషయంలో రాష్ట్రంలోని అక్రమ వలసదారులు, ఉగ్రవాద సానుభూతిపరులపై ఇప్పటి వరకూ ప్రభుత్వం వద్ద ఉన్న సమాచారాన్ని అనుసరించి మరింత లోతుగా విచారణ చేపట్టాలని కోరారు. గతంలో రాష్ట్రంలో ఏవైనా ఉగ్ర కార్యకలాపాల్లో పాల్గొన్న వారిపై పూర్తి స్థాయి అప్రమత్తత అవసరం అని.. ఉత్తరాంధ్ర, గోదావరి, మన్యం జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. స్లీపర్

వివరాలు 2లో..

వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్ పై విచారణ వాయిదా...

## పోలీసులకు కోర్టు కీలక ఆదేశాలు

- నకిలీ పట్టాల పంపిణీ కేసు
- వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్ ను విచారించిన నూజివీడు కోర్టు
- కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు కోర్టు ఆదేశాలు

వివరాలు 2లో..



## ఆకస్మిక వర్షాల వల్లే బెంగళూరులో ఇబ్బందులు!

- బెంగళూరును ముంచెత్తిన ఊహించని భారీ వర్షం
- గత 24 గంటల్లో 104 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- పలు ప్రాంతాలు జలమయం, అధికారులకు సీఎం సిద్ధరామయ్య ఆదేశాలు
- బుధవారం నగరంలో పర్యటించనున్న ముఖ్యమంత్రి

వివరాలు 2లో..





విశాఖ డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా...

## హాజరుకాని నేతలపై లోకేశ్ ఆగ్రహం

- డిప్యూటీ మేయర్ పదవి జనసేనకు కేటాయింపు
- ఎన్నికకు పూర్తి స్థాయిలో హాజరు కాని టీడీపీ కార్పొరేటర్లు...!
- చర్యలు తీసుకోవడానికి వెనుకాడవద్దన్న లోకేశ్

పెన్ పవర్ డెస్క్: గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) డిప్యూటీ మేయర్ ఎన్నిక అనూహ్యంగా వాయిదా పడటం అధికార తెలుగుదేశం పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కార్పొరేటర్లు తగినంత సంఖ్యలో హాజరుకాకపోవడమే దీనికి కారణం. ఈ పరిణామంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈరోజు జరగాల్సిన జీవీఎంసీ డిప్యూటీ మేయర్ ఎన్నికకు మొత్తం 74 మంది సభ్యులకు గాను కేవలం 54 మందే హాజరయ్యారు. ఎన్నిక నిర్వహణకు కనీసం 56 మంది సభ్యుల కోరం అవసరం కాగా, ఇద్దరు సభ్యుల కొరత ఏర్పడింది. దీంతో అధికారులు ఎన్నికను రేపటికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే కౌన్సిల్ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయినప్పటికీ, పలువురు గైర్హాజరు కావడం గమనార్హం.

ఈ పరిణామాలపై టీడీపీ అధిష్ఠానం సీరియస్‌గా దృష్టి సారించింది. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, ఈ ఎన్నికకు గైర్హాజరైన కార్పొరేటర్లకు తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని రాష్ట్ర నాయకత్వాన్ని ఆదేశించినట్లు సమాచారం. కొందరిపై కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడవద్దని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం

వివరాలు 2లో..

## వెనక్కి తగ్గేదేలేదు, గాజాను స్వాధీనం చేసుకుంటాం

- గాజాలో దాడులు మరింత తీవ్రతరం చేసిన ఇజ్రాయెల్
- తాజా దాడుల్లో 103 మంది పాలస్తీనియన్ల మృతి
- ఖాన్‌యూనిస్‌ను ఖాళీ చేయాలని ప్రజలకు ఇజ్రాయెల్ సైన్యం ఆదేశం



గాజా భూభాగాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకుంటామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రకటించారు. హమాస్‌తో జరుగుతున్న యుద్ధం తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో గాజాలో దాడులను మరింత ఉద్ధృతం చేసినట్లు ఆయన స్పష్టం చేశారు. దౌత్యపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని,

వివరాలు 2లో..

## ఏం చేస్తున్నారు మీరు?... కాళేశ్వరంలో బ్రహ్మకుమారీలపై స్వామీజీల ఫైర్

- కాళేశ్వరంలో బ్రహ్మకుమారీల ప్రచార కార్యక్రమంపై తీవ్ర వివాదం
- హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధుల నుంచి తీవ్ర వ్యతిరేకత
- సనాతన ధర్మాన్ని వక్రీకరిస్తున్నారని, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపణ
- కొన్ని ప్రచార చిత్రాలను చించివేసి నిరసన వ్యక్తం చేసిన కొందరు
- తక్షణమే కార్యక్రమాలు ఆపాలని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరిక
- హిందూ దేవుళ్ల చిత్రాలతో పాటు ఏసుక్రీస్తు చిత్రం ప్రదర్శించడంపై మండిపాటు



వివరాలు 2లో..

## 140 కోట్లమందితో అవస్త పడుతున్నాం... భారత్ ఏమైనా ధర్మసత్రమా?

### శ్రీలంక వ్యక్తికి సుప్రీంకోర్టు ఘాటు ప్రశ్న

- శ్రీలంక శరణార్థి అభ్యర్థనను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు
- భారత్ ప్రపంచ శరణార్థులకు ధర్మశాల కాదని స్పష్టం
- 140 కోట్ల జనాభాతో మేమే సతమతమవుతున్నామన్న జస్టిస్ దత్తా
- ఆర్టికల్ 19 హక్కులు కేవలం భారత పౌరులకేనని ఉద్ఘాటన

వివరాలు 2లో..




పెన్ పవర్ డెస్క్: "ప్రపంచంలోని శరణార్థులందరికీ ఆశ్రయం కల్పించడానికి భారత దేశం ఏమీ ధర్మసత్రం కాదు. ఇప్పటికే 140 కోట్ల జనాభాతో మేం ఇబ్బందులు పడుతున్నాం. విదేశీ పౌరులందరినీ చేర్చుకోవడానికి ఇది ధర్మశాల కాదు,"

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలె

- ఫొటోలకే పరిమితమైతే ఎట్ల ఇస్తరు?
- సోషల్ జస్టిస్ ప్రకారమే పోస్టులు
- స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తా చాటాలె
- చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

వివరాలు 2లో..



ఏపీలో రెండ్రోజులు భారీ వర్షాలే...

## ఏపీఎస్డీఎంఏ అలర్ట్

- రానున్న రెండ్రోజులు రాయలసీమలో భారీ వర్షాలు
- గంటకు 50-60 కి.మీ. వేగంతో ఈదురుగాలులు, పిడుగులు
- పలు జిల్లాల్లో కుండపోత వానలకు అవకాశం
- హోర్డింగ్‌లు, పాత గోడల దగ్గర ఉండొద్దని సూచన
- ఉష్ణోగ్రతలు 38°C-40°C మధ్య ఉండే ఛాన్స్
- కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు



ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతంలో రానున్న రెండు రోజుల పాటు పలుచోట్ల పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు

వివరాలు 2లో..

## కాల్పుల విరమణలో ట్రంప్ పాత్ర లేదు



వివరాలు 2లో..

- భారత్-పాక్ కాల్పుల విరమణపై విదేశాంగ కార్యదర్శి కీలక ప్రకటన
- ఒప్పందంలో అమెరికా పాత్ర లేదని స్పష్టం చేసిన విక్రమ్ మిస్రీ
- ట్రంప్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన భారత ప్రభుత్వం
- ఆపరేషన్ సిందూర్‌లో పాక్ వైమానిక స్థావరాలపై భారత్ ధాటియైన దాడులు
- పాక్ నుంచి ఎలాంటి అణు సంకేతాలు లేవని వెల్లడి
- పహల్గాం దాడికి ప్రతీకారంగానే ఆపరేషన్ సిందూర్

## పాకిస్థాన్ తో యుద్ధంలో ఎన్ని విమానాలు కోల్పోయామో చెప్పండి

- ఆపరేషన్ సిందూర్ ప్రారంభానికి ముందే పాకిస్థాన్ కు సమాచారం అందించారన్న రాహుల్
- దీని వల్ల మన వైమానికి దళం ఎన్ని విమానాలో కోల్పోయిందో చెప్పాలని డిమాండ్
- రెండు రోజుల పోస్టుకు కొనసాగింపుగా తాజా ట్వీట్



కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆపరేషన్ సిందూర్ వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తూ,

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# కవిత కోపానికి అసలు కారణమదేనటగా?

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తనకు పార్టీలో ప్రాధాన్యత దక్కడం లేదని బాధపడుతున్నారని తెలిసింది. దీంతో పాటు తనను ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అక్రమంగా అరెస్ట్ చేసిన బీజేపీతో బీఆర్ఎస్ సయోధ్యతగా నడుస్తుండటం కూడా కవిత కోపానికి కారణమని తెలిసింది. కవిత ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో కొన్ని నెలల పాటు తీహార్ జైలులో ఉండి వచ్చారు. బెయిల్ రావడం కూడా గగనమయింది. ఆరోగ్యం కూడా జైల్లో ఉన్న సమయంలో ఇబ్బందులు పెట్టింది. తనను అక్రమ కేసులో బీజేపీ నేతలు కావాలని ఇరికించారన్న కవిత లో అభిప్రాయం బలంగా ఉంది. తాను చేయని నేరానికి శిక్ష అనుభవించడమే కాకుండా జైల్లో ఉండటంతో పాటు తన రాజకీయ ఎదుగుదలను అడ్డుకున్న బీజేపీని తాను క్షమించేది లేదని చెబుతున్నారు.

**మెతక వైఖరిని సహించలేక...**

బెయిల్ పై బయటకు వచ్చిన తర్వాత కవిత ఇదే శపథాన్ని చేశారు. తాను బీజేపీ అంతం అయ్యే వరకూ పోరాడతానని నాడు జైలు బయట తన అభిమానులను ఉద్దేశించి ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజకీయాల ప్రయోజనాల కోసమే తనను జైలు పాలు చేసిందని, తన కుటుంబానికి కొన్ని నెలలపాటు దూరం చేసిందన్న ఆగ్రహం కమలం పార్టీపై కవితకు బాగా ఉంది. తనకు కాంగ్రెస్ కంటే ప్రధాన శత్రువు బీజేపీనే ఆమె చూస్తున్నారు. అందులో ఎలాంటి సందేహం లేదు. కవిత సన్నిహితుల వద్ద కూడా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తున్నారట. అలాంటి బీజేపీ పట్ల బీఆర్ఎస్ పార్టీ మెతక వైఖరిని అవలంబించడాన్ని కవిత సహించలేకపోతున్నారు.

**బీజేపీని పన్నెత్తు మాట అనకుండా...**

ఇటీవల పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు వరంగల్ జరిగినప్పుడు తన తండ్రి కేసీఆర్ కూడా కాంగ్రెస్ పై ఒంటికాలు మీద లేచారు కానీ బీజేపీపై విమర్శలకు పెద్దగా వెళ్లలేదు. ఈ అసంతృప్తి ఆమెలో అడుగడుగునా కనిపిస్తుందని చెబుతున్నారు. తన సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు, హరీశ్ రావు కూడా రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై ధ్వజమెత్తుతున్నారని, బీజేపీని పన్నెత్తు మాట అనకపోవడం తనను బాధిస్తుందని ఆమె చెబుతున్నారట. అందుకే ఇటీవల సామాజిక తెలంగాణ నినాదాన్ని ఎత్తుకున్నారని అంటున్నారు. బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఏమనుకున్నా తాను బీజేపీపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నానని, బీజేపీకి బీసీల ఓటు బ్యాంకు దూరం చేసే లక్ష్యంతోనే కవిత ఆ రకమైన వ్యాఖ్యలు చేశారంటున్నారు. మరి కవిత కోపాన్ని పసిగట్టిన కారు పార్టీ అగ్రనేతలు ఇప్పటికైనా బీజేపీ ని కూడా శత్రువుగా చూస్తారా? లేదా? అన్నది తేలాల్సి ఉంది. ఐ

## వెనక్కి తగ్గేదేలేదు, గాజాను స్వాధీనం చేసుకుంటాం

- మొదటి పేజీ తరువాయి

గాజాలో ఆకలి చావులను నివారించాల్సిన అవసరం ఉందని కూడా తాము గుర్తించామని నెతన్యాహు తెలిపారు. “మా పోరాటం చాలా తీవ్రంగా సాగుతోంది. మేము పురోగతి సాధిస్తున్నాం. ఆ ప్రాంతం మొత్తాన్ని నియంత్రణలోకి తీసుకుంటాం. ఇందులో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. విజయం సాధించాలంటే, మమ్మల్ని ఎవరూ అడ్డుకోలేరనే విధంగా వ్యవహరించాలి” అని నెతన్యాహు టెలిగ్రామ్ వేదికగా పోస్ట్ చేసిన వీడియోలో పేర్కొన్నారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించేందుకు హమాస్ అంగీకరించకపోవడం వల్లే దాడులను తీవ్రతరం చేశామని నెతన్యాహు గతంలో వెల్లడించిన విషయం తెలిసిందే. శనివారం అర్ధరాత్రి సమయంలో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తున్న నివాసాలు, శిబిరాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఖాన్‌యూనిస్‌లో 29 మంది, ఉత్తర గాజాలో 48 మంది, జబాలియాలోని శరణార్థి శిబిరంలో 26 మంది మరణించారని, మొత్తం మృతుల సంఖ్య 103కు చేరిందని స్థానిక ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఇదిలా ఉండగా, గాజాలోని రెండో అతిపెద్ద నగరమైన ఖాన్‌యూనిస్‌తో పాటు సమీప ప్రాంతాలను వెంటనే ఖాళీ చేయాలని స్థానిక ప్రజలను ఇజ్రాయెల్ సైన్యం ఆదేశించింది. ఈ ప్రాంతాలను ప్రమాదకరమైన పోరాట క్షేత్రాలుగా పరిగణిస్తున్నట్లు పేర్కొంది.

## ఆకస్మిక వర్షాల వల్లే బెంగళూరులో ఇబ్బందులు!

**పెన్ పవర్ డెస్క్:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య బెంగళూరు నగరంలో భారీ వర్షాల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులపై స్పందించారు. నగరంలో నెలకొన్న సమస్యలకు ప్రధాన కారణం ఆకస్మికంగా కురిసిన వానలేనని అభిప్రాయపడ్డారు.

బెంగళూరు నగరంలో కుండపోత వర్షం కురిసింది. ఈ భారీ వర్షం కారణంగా అనేక ప్రాంతాలు జలమయమయ్యాయని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) అధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత 24 గంటల్లో నగరంలో 104 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, దీనివల్ల పలు ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని పేర్కొన్నారు. వర్షాల వల్ల ముంపునకు గురైన ప్రాంతాల్లో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఇతర మంత్రులతో కలిసి పర్యటించాలని తొలుత భావించినప్పటికీ, ఆ కార్యక్రమాన్ని బుధవారానికి వాయిదా వేసుకున్నట్లు సిద్ధరామయ్య వెల్లడించారు.

“ఎల్లుండి నగరంలో పర్యటిస్తాను. ఈరోజు వెళితే ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయి. సూర్యాస్తమయం తర్వాత పరిస్థితిని సరిగా అంచనా వేయలేను. బాధితులతో మాట్లాడటం కూడా కష్టమవుతుంది” అని ఆయన వివరించారు. మురుగు నీటి కాలువల ఆక్రమణలు, కాలువల లోతు తక్కువగా ఉండటం, పూడిక పేరుకుపోవడం వంటి సమస్యలపై తాను బీబీఎంపీ అధికారులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నానని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. బెంగళూరులో మొత్తం 859.90 కిలోమీటర్ల మేర మురుగునీటి కాలువలు ఉన్నాయని, ఇప్పటివరకు 491 కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్స్ నిర్మించామని తెలిపారు. మరో 195 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుగుతోందని, 173 కిలోమీటర్ల కాలువల ఆధునికీకరణకు ప్రపంచ బ్యాంకు నుంచి రుణం తీసుకున్నామని, ఆ పనులు కూడా పురోగతిలో ఉన్నాయని సిద్ధరామయ్య వివరించారు. ఈ పనులన్నీ పూర్తయితే వరద ముంపు సమస్యను నివారించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నగరంలో 210 లోతట్టు ప్రాంతాలను గుర్తించి, వాటిని సమస్యాత్మకమైనవిగా, అత్యంత సమస్యాత్మకమైనవిగా వర్గీకరించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. వీటిలో 166 ప్రాంతాల్లో పనులు పూర్తయ్యాయని, మిగిలిన 44 ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. “ఈ 44 సమస్యాత్మక ప్రాంతాల్లో పనులు పూర్తయితే చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయి. ప్రస్తుతం వీటిలో 24 చోట్ల పనులు జరుగుతున్నాయి” అని ఆయన పేర్కొన్నారు. ఆక్రమణదారులు ఎవరైనా నిష్పక్షపాతంగా చర్యలు తీసుకుంటామని సిద్ధరామయ్య స్పష్టం చేశారు.

## పాకిస్థాన్ తో యుద్ధంలో ఎన్ని విమానాలు కోల్పోయామో చెప్పండి

- మొదటి పేజీ తరువాయి

పాకిస్థాన్‌కు ముందస్తు సమాచారం ఇచ్చారన్న ఆరోపణలపై ఆయనను నిలదీశారు. ఈ వ్యవహారంలో భారత వైమానిక దళం ఎన్ని విమానాలను కోల్పోయిందో చెప్పాలని రాహుల్ గట్టిగా ప్రశ్నించారు.

ఆపరేషన్ సిందూర్ దాడి ప్రారంభానికి ముందే పాకిస్థాన్‌కు సమాచారం చేరవేయడం నేరమని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఈ విషయంలో జైశంకర్ మౌనం వహించడం కేవలం సమాచారాన్ని వెల్లడించకపోవడం మాత్రమే కాదని, అది విపత్కర పరిణామం అని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. “మరోసారి అడుగుతున్నాను, పాకిస్థాన్‌కు ముందే సమాచారం తెలియడం వల్ల మనం ఎన్ని విమానాలు కోల్పోయాం?” అని జైశంకర్‌ను సూటిగా ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం చేసిన పోస్టుకు కొనసాగింపుగా ఈ తాజా ట్వీట్ చేశారు.

# రాష్ట్రంలో ఉగ్రవాద కదలికలపై అప్రమత్తత అవసరం

- మొదటి పేజీ తరువాయి

సెల్స్, తీవ్రవాద సానుభూతిపరుల ఉనికిని గుర్తించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘా ఉంచి తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని పవన్ తన లేఖలో తెలిపారు.

తన లేఖలో రోహింగ్యాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. గుంటూరుతోపాటు ఇతర జిల్లాల్లోనూ రోహింగ్యాల ఉనికిపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. వీరిలో కొందరికి రేషన్, ఆధార్, ఓటర్ కార్డులు ఉన్నాయనే సమాచారం వస్తోందని.. ఇది ఆందోళనకర పరిణామం అని తెలిపారు. ఈ క్రమంలో కొన్ని సూచనలు చేశారు. అనుమానితుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ ఐడీ మొదలైన గుర్తింపు పత్రాలు కలిగి ఉన్నారా? లేదా? అనుమానిత వ్యక్తులు ప్రభుత్వ శాఖల నుంచి ఐడీ కార్డులు, ధ్రువపత్రాలు పొంది ఉంటే వాటిని ఎలా పొందారు? వారికి ఆశ్రయం ఎవరు ఇచ్చారు? స్థానికంగా వారికి ఎవరు సౌకర్యాలు కల్పిస్తున్నారు? వారికి సహకరిస్తున్న వ్యక్తులు, సంస్థల గుర్తింపు తదితర అంశాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని స్పష్టం చేశారు. జాతీయ భద్రత, ప్రజల భద్రతను అత్యంత ప్రాధాన్యంతాంశంగా పరిగణించి తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు.

కొన్నేళ్ళ కిందట గుంటూరు, గతేడాది రాయలసీమ ప్రాంతాల్లో ఎన్ఐఏ. దాడులు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకుందని... ఈ విషయాన్నీ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో మన పోలీసులు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. దేశ భద్రత, రక్షణ అనేవి ఈ తరుణంలో అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నవని చెబుతూ... రాష్ట్ర పోలీసు యంత్రాంగం శాంతిభద్రతలతోపాటు అంతర్గత భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తే కేంద్ర ప్రభుత్వ చర్యలకి రాష్ట్రం సహకారం తోడవుతుందన్నారు.

**గతంలోనూ ప్రస్తావించిన పవన్ కల్యాణ్**

కానాడలో రేషన్ బియ్యం అక్రమ రవాణా అంశంపై గతేడాది నవంబర్ నెలలో పరిశీలనకు వెళ్ళిన సందర్భంలోనూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దేశ అంతర్గత భద్రతను ప్రస్తావించారు. కాకినాడ జిల్లా రెవెన్యూ, పోలీస్, పోర్టు అధికారులతో మాట్లాడుతూ తీర ప్రాంతంలో నిఘా వ్యవస్థ సక్రమంగా లేని పక్షంలో అంతర్గత భద్రతకు ముప్పు వాటిల్లుతుందనే ఆందోళన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రస్తావించిన అంశాలపై కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ వెంటనే సానుకూలంగా స్పందించింది. అందుకు అనుగుణంగా కేంద్ర నిఘా వర్గాలు తక్షణమే చర్యలకు ఉపక్రమించాయి.

# 140 కోట్లమందితో అవస్త పడుతున్నాం... భారత్ ఏమైనా ధర్మసత్రమా?

- మొదటి పేజీ తరువాయి

అంటూ సుప్రీంకోర్టు ఓ శ్రీలంక జాతీయుడిపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది. తనకు ఆశ్రయం కల్పించాలంటూ సదరు వ్యక్తి పెట్టుకున్న పిటిషన్‌ను శుక్రవారం కొట్టివేసింది. ఈ దేశంలో స్థిర నివాసం కల్పించాలనే హక్కు మీకెక్కడిదని ఘాటుగా ప్రశ్నించింది. జస్టిస్ దిపాంకర్ దత్తా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. శ్రీలంకలో ఒకప్పుడు క్రియాశీలంగా ఉన్న లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలం (ఎల్‌టీటీఈ) ఉగ్రవాద సంస్థతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై 2015లో సదరు శ్రీలంక జాతీయుడిని భారత్ లో అరెస్టు చేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (%ఖూాూా%) కింద 2018లో ట్రయల్ కోర్టు అతడిని దోషిగా నిర్ధారించి, పదేళ్ల జైలు శిక్ష విధించింది. అయితే, 2022లో మద్రాస్ హైకోర్టు ఈ శిక్షను ఏడేళ్లకు తగ్గించింది. శిక్షాకాలం పూర్తయ్యాక దేశం విడిచి వెళ్లాలని, అప్పటివరకు శరణార్థుల శిబిరంలో ఉండాలని ఆదేశించింది. దీంతో, సదరు శ్రీలంక తమిళ జాతీయుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తాను వీసాపైనే భారత్‌కు వచ్చానని, స్వదేశంలో తనకు ప్రాణహాని ఉందని, తన భార్యాపిల్లలు ఇక్కడే స్థిరపడ్డారని తన పిటిషన్‌లో పేర్కొన్నాడు.

శిక్ష పూర్తయి దాదాపు మూడేళ్లు కావస్తున్నా తనను ఇంకా నిర్బంధంలోనే ఉంచారని, దేశం నుంచి పంపించే ప్రక్రియ కూడా ప్రారంభించలేదని వాపోయాడు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 (జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ), ఆర్టికల్ 19 (ప్రాథమిక హక్కులు - వాక్ స్వాతంత్ర్యం, సంచార స్వేచ్ఛ వంటివి) కింద తమకు హక్కులున్నాయని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. పిటిషనర్ వాదనలపై జస్టిస్ దత్తా తీవ్రంగా స్పందించారు. “భారత్ ధర్మసత్రం కాదు” అని వ్యాఖ్యానించారు. పిటిషనర్‌ను చట్ట ప్రకారమే నిర్బంధంలోకి తీసుకున్నారని, కాబట్టి ఆర్టికల్ 21 ఉల్లంఘన జరగలేదని స్పష్టం చేశారు. ఆర్టికల్ 19 హక్కులు కేవలం భారత పౌరులకు మాత్రమే వర్తిస్తాయని తేల్చిచెప్పారు. “ఇక్కడ స్థిరపడటానికి మీకేం హక్కు ఉంది?” అని కోర్టు సూటిగా ప్రశ్నించింది.

తాను శరణార్థినని, శ్రీలంకలో తన ప్రాణాలకు ముప్పు ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది పదేపదే విన్నవించినప్పటికీ, ధర్మాసనం అంగీకరించలేదు. “భారతదేశం మీ కోసం ఎదురుచూడటం లేదు. మీరు కోరుకుంటే మరో దేశానికి వెళ్లవచ్చు” అని సూచిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. చట్టప్రకారం నిర్దేశించిన ప్రక్రియ పూర్తయిన తర్వాత పిటిషనర్‌ను శ్రీలంకకు పంపించాలని అధికారులను ఆదేశించింది.

# కాల్పుల విరమణలో ట్రంప్ పాత్ర లేదు

- మొదటి పేజీ తరువాయి

భారత్-పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా పాత్ర లేదని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు. ఈ నిర్ణయం పూర్తిగా ద్వైపాక్షికమని, ట్రంప్ వ్యాఖ్యల్లో నిజం లేదని ఆయన పార్లమెంటరీ కమిటీకి తెలిపారు. ఈ నిర్ణయం పూర్తిగా ద్వైపాక్షికమని, ఇరు దేశాల మధ్య జరిగిన చర్చల ఫలితమేనని స్పష్టం చేశారు. సోమవారం జరిగిన విదేశీ వ్యవహారాల పార్లమెంట్ స్థాయీ సంఘం సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ‘ఆపరేషన్ సిందూర్’ సమయంలో పాకిస్థాన్ వైమానిక స్థావరాలపై భారత వైమానిక దళం తీవ్రంగా దాడులు చేసిందని కూడా ఆయన పునరుద్ఘాటించారు.

ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలుమార్లు భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించడంలో తమ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని, కాల్పుల విరమణకు సహకరించిందని చేసిన వ్యాఖ్యలపై కమిటీలోని కొందరు ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. “ట్రంప్ కనీసం ఏడుసార్లు, కాల్పుల విరమణకు తాను మధ్యవర్తిత్వం చేశానని బహిరంగంగా చెప్పారు. దీనిపై భారత్ ఎందుకు మౌనంగా ఉంది?” అని ఓ సభ్యుడు ప్రశ్నించగా, “ట్రంప్ పదేపదే ఈ అంశాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడానికి భారత్ ఎందుకు అనుమతించింది, ప్రత్యేకించి ఆయన కశ్మీర్ అంశాన్ని ప్రస్తావిస్తున్నప్పుడు?” అని మరో సభ్యుడు నిలదీశారు.

ఈ ఆరోపణలను విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఖండించారు. భారత్-పాక్ కాల్పుల విరమణ ఒప్పందం కేవలం ద్వైపాక్షిక నిర్ణయమని, ఇందులో మూడో దేశం ప్రమేయం ఏమాత్రం లేదని ఆయన స్పష్టం చేశారు. “కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా పాత్ర అస్సలు లేదు” అని మిస్రీ కమిటీకి తెలిపారు. “డొనాల్డ్ ట్రంప్ తెరపైకి రావడానికి మా అనుమతి తీసుకోలేదు. ఆయన అలా రావాలని కోరుకున్నారు, అందుకే వచ్చారు” అని ఆయన వ్యాఖ్యానించినట్లు సమాచారం.

**పాక్ నుంచి ‘అణు’ సంకేతాలు లేవు**

భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన ఘర్షణ సంప్రదాయ యుద్ధ పరిధిలోనే ఉందని, ఇస్లామాబాద్ నుంచి ఎలాంటి అణు హెచ్చరికలు గానీ, సంకేతాలు గానీ రాలేదని విదేశాంగ కార్యదర్శి పునరుద్ఘాటించారు. ఇరు దేశాల డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓలు) మే 10న అన్ని సైనిక చర్యలను నిలిపివేయడానికి ఒక అవగాహనకు వచ్చారని ఆయన గుర్తుచేశారు. పాకిస్థాన్ చైనా నిర్మిత సైనిక సామగ్రిని ఉపయోగించడంపై ప్రతిపక్ష సభ్యులు ఆందోళన వ్యక్తం చేయగా, “వారు ఏమి ఉపయోగించారన్నది ముఖ్యం కాదు... మనం వారి వైమానిక స్థావరాలను గట్టిగా దెబ్బతీశామన్నదే ముఖ్యం” అని విక్రమ్ మిస్రీ సమాధానమిచ్చినట్లు తెలిసింది. ఘర్షణల సమయంలో ఎన్ని భారత విమానాలు దెబ్బతిన్నాయనే ప్రశ్నకు, జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా సమాచారం ఇవ్వలేనని ఆయన సున్నితంగా తిరస్కరించారు.

విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ చేసిన ఓ ప్రకటనపై అడిగిన ప్రశ్నలకు మిస్రీ స్పందిస్తూ, మంత్రి మాటలను తప్పుగా అర్థం చేసుకోవద్దని సభ్యులను కోరారు. ‘ఆపరేషన్ సిందూర్’ మొదటి దశ తర్వాత, పాకిస్థాన్ మరియు పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని ఉగ్రవాద స్థావరాలపై మాత్రమే దాడులు చేశామని పాక్ కు భారత్ తెలియజేసిందని జైశంకర్ చెప్పినట్లు మిస్రీ స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అధ్యక్షతన జరిగిన ఈ పార్లమెంట్ స్థాయీ సంఘం సమావేశంలో తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ, కాంగ్రెస్ నేతలు రాజీవ్ శుక్లా, దీపేందర్ హుడా, ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, బీజేపీ ఎంపీలు అపరాజిత సారంగి, అరుణ్ గోవిల్ తదితరులు పాల్గొన్నారు. పహల్గాం దాడికి ప్రతిగా భారత్ చేపట్టిన ‘ఆపరేషన్ సిందూర్’ అనంతరం, అణ్వస్త్ర దేశాలైన భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఈ సమావేశం జరిగింది.

# ఏం చేస్తున్నారు మీరు?... కాళేశ్వరంలో బ్రహ్మకుమారీలపై స్వామీజీల ఫైర్

- మొదటి పేజీ తరువాయి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమం తీవ్ర వివాదాస్పదంగా మారింది. హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు, కొందరు స్వామీజీలు ఈ కార్యక్రమ తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. బ్రహ్మకుమారీలు సనాతన హైందవ ధర్మానికి విరుద్ధంగా బోధనలు చేస్తున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వారు ఆరోపించారు. హిందూ దేవుళ్ల చిత్రాలను ఉపయోగించుకుంటూ, తమదైన సిద్ధాంతాలను ప్రచారం చేయడంపై ధార్మిక సంఘాల ప్రతినిధులు మండిపడ్డారు. ముఖ్యంగా శివలింగం, శ్రీమన్నారాయణుడి చిత్రాలతో పాటు ఏసుక్రీస్తు చిత్రాన్ని కూడా ప్రదర్శించడం వారి ఆగ్రహానికి కారణమైంది. “భగవంతుడు ఇప్పుడే పుట్టాడని, 5000 సంవత్సరాల తర్వాత ఈ సృష్టి అంతా ఉండదని చెబుతున్న పిచ్చి మాటలతో సమాజంలో గందరగోళం సృష్టిస్తున్నారు” అని వారు విమర్శించారు. వేద ప్రమాణం లేని ఇలాంటి బోధనల వల్ల హిందూ సమాజంలో అయోమయం నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆరోపణలపై బ్రహ్మకుమారీలకు చెందిన ఒక ప్రతినిధి (ఆమె తనను తాను డాక్టర్‌గా పరిచయం చేసుకున్నారు) స్పందించే ప్రయత్నం చేశారు. తాము ‘పాజిటివ్ హెల్త్ ఎగ్జిబిషన్’ తో పాటు వ్యసన విముక్తి వంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అయితే, హిందూ ధార్మిక సంఘాల ప్రతినిధులు ఈ వివరణతో ఏకీభవించలేదు. “డబ్బులు వసూలు చేసుకోవడంపై మాకు అభ్యంతరం లేదు. కానీ హిందూ ధర్మాన్ని, దేవుళ్లను అడ్డం పెట్టుకుని, ప్రజల విశ్వాసాలను దెబ్బతీసేలా, వారిని తప్పుదోవ పట్టించేలా ప్రచారం చేస్తే మాత్రం సహించబోము” అని వారు తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన కొందరు వ్యక్తులు బ్రహ్మకుమారీలు ఏర్పాటు చేసిన కొన్ని ప్రచార చిత్రాలను, ఫ్లెక్సీలను చించివేశారు. “మీరు వెంటనే ఈ ప్రచార బోర్డులను తొలగించాలి. సనాతన ధర్మానికి విరుద్ధమైన మీ సిద్ధాంతాలను ఇక్కడ ప్రచారం చేయవద్దు. మా దేవుళ్ల చిత్రాలను మీ ప్రచారానికి వాడుకోవద్దు” అని వారు డిమాండ్ చేశారు. తమ హెచ్చరికలను బేఖాతరు చేసి, ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. తమ వాళ్లు అక్కడే ఉండి పరిస్థితిని గమనిస్తారని, మళ్లీ తేడా వస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

## విశాఖ డిప్యూటీ మేయర్ ఎన్నిక వాయిదా... హాజరుకాని నేతలపై లోకేశ్ ఆగ్రహం

- మొదటి పేజీ తరువాయి

కాకుండా చూడాలని ఆయన కీలక సూచనలు చేసినట్లు తెలిసింది.

ఈ పరిణామాలపై ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ... జీవీఎంసీలో తమకు కావాల్సినంత సంఖ్యాబలం ఉందని తెలిపారు. “డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఎంపిక విషయంలో నిర్ణయం తీసుకోవడంలో కొంత ఆలస్యం జరిగిన మాట వాస్తవమే. గత రాత్రి 11 గంటలకు ఆ పదవిని జనసేన పార్టీకి కేటాయించాలని నిర్ణయించాం” అని పల్లా తెలిపారు. టీడీపీలో కూడా ఆ పదవిని ఆశించేవారు ఉన్నారని ఆయన గుర్తుచేశారు. ఎన్నిక వాయిదా పడటానికి సమన్వయ లోపం కూడా ఒక కారణమని, అందుకే ఈ ఇబ్బంది తలెత్తిందని ఆయన అంగీకరించారు. జీవీఎంసీ కౌన్సిల్‌కు సభ్యులంతా హాజరవుతారని, దీనికి తాను పూర్తి బాధ్యత వహిస్తానని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

రేపు జరగనున్న ఎన్నికకు సభ్యులందరూ హాజరై, డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రశాంతంగా ముగిసేలా చూడాలని పార్టీ శ్రేణులకు అధిష్ఠానం నుంచి గట్టి ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ఈ పరిణామం విశాఖ రాజకీయాల్లో కొంత అలజడి సృష్టించింది.

## వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్ పై విచారణ వాయిదా... పోలీసులకు కోర్టు కీలక ఆదేశాలు

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి కొన్ని కేసుల్లో బెయిల్ వచ్చినప్పటికీ జైల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఉంది. తాజాగా నకిలీ పట్టాల పంపిణీ కేసులో వంశీ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ పై నూజివీడు కోర్టు ఈరోజు విచారణ జరిపింది. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.

వల్లభనేని వంశీ ప్రస్తుతం విజయవాడ సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఆయనపై సత్యవర్ధన్ ను కిడ్నాప్ చేసిన కేసు, గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి చేసిన కేసు, అక్రమ మైనింగ్ కేసు, నకిలీ పట్టాల కేసు తదితర పలు కేసులు ఉన్నాయి. పలు కేసుల్లో ఆయనకు బెయిల్/ముందస్తు బెయిల్ లభించింది. మిగిలిన కేసుల్లో బెయిల్ వస్తే కానీ ఆయన జైలు నుంచి విడుదల కాలేరు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలె

కోల్ బెల్ట్/చెన్నూరు: కాంగ్రెస్‌పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, వాళ్లకే పదవులు వస్తాయని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్?వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ లో రాష్ట్ర అయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ అబ్జర్వర్లు జంగా రాఘవరెడ్డి, రాంభూపాల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా పట్టణ, మండల అధ్యక్షుల ఎంపిక కోసం ఇవాళ దరఖాస్తులు స్వీకరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మాట్లాడారు.. ఫొటోలకే పరిమితమైతే అలాంటి నాయకులకు కాంగ్రెస్? పార్టీలో పదవులు ఇవ్వడం కష్టమన్నారు. గత బీఆర్ఎస్? హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలు, లీడర్లపై తప్పుడు పోలీసులు కేసులు పెట్టిందన్నారు. ‘ రానున్న రోజుల్లో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దుతా. వారంలో రెండు రోజులు నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారిస్తున్న. సోషల్ మీడియాలో కొందరు పనిగట్టుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం చెన్నూరు నియోజకవర్గంలో భూదందా, బియ్యం దందా, ఇసుక దందా వంటివి లేకుండా చేశా.. ఎన్ని ఒత్తిళ్లు చేసిన ఈ దందాలు లేకుండా బంద్ చేయించా. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు మేరకు కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల్లో సోషల్ జస్టిస్ దృష్టిలో పెట్టుకొని టీపీసీసీ నిబంధన మేరకు కమిటీలను ఎంపిక చేస్తారు. ’ అని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్? వెంకటస్వామి అన్నారు. టీపీసీసీ అబ్జర్వర్లు జంగా రాఘవరెడ్డి, రాంభూపాల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, లీడర్లను అధిష్టానం అండగా ఉంటుందన్నారు. వారికే సంస్థాగత ఎన్నికల కమిటీల్లో ప్రయారిటీ ఇస్తుందని చెప్పారు.

## ఏపీలో రెండ్రోజులు భారీ వర్షాలే... ఏపీఎస్డీఎంఏ అలర్ట్

- మొదటి పేజీ తరువాయి

తీసుకోవాలని ఆయన సూచించారు.

రానున్న రెండు రోజుల్లో రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడతాయని, ఈ సమయంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని కూర్మనాథ్ పేర్కొన్నారు. ముఖ్యంగా రేపు (మే 20) తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, వైఎస్ఆర్, అన్నమయ్య, శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అనేక చోట్ల భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని వివరించారు. ఇదే సమయంలో విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, ఉభయ గోదావరి జిల్లాలు, కోనసీమ, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచిస్తూ, హోర్డింగ్‌ల కింద, చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, పాత భవనాల దగ్గర నిలబడవద్దని హెచ్చరించారు. వర్షాలతో పాటు రాష్ట్రంలో కొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు కూడా 38 డిగ్రీల సెల్సియస్ నుంచి 40 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని కూర్మనాథ్ వెల్లడించారు. వాతావరణ మార్పులను గమనిస్తూ, ప్రభుత్వ సూచనలను పాటించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## నూతన కమిటీకి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి అభినందనలు



**శ్రీకాళహస్తి/ పెన్ పవర్/ ప్రతినిధి/ మే 19 :** శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ నూతన కార్యావర్గాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, తన స్వగృహానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాస్వామ్యబద్దంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రత విషయంలో రాజీ పడనని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముత్యాల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కందేరి కార్తీక్ నాయుడు, గౌరవాధ్యక్షులు వై. చంద్రయ్యలల్, పిఆర్ఓ ఈశ్వర్ పరిటాలను ఎమ్మెల్యే ఆత్మీయంగా అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యేను నూతన కార్యవర్గం శాలువా, పూలమాలతో సత్కరించింది.




## అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

### లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలి :జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ మే 19 :** ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు.. పిజిఆర్ఎస్ లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని చెప్పినప్పటికీ కొన్ని శాఖల అధికారులు వారం, 10 రోజులైనా చూడడం లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.. సిడిపిఓ కర్నూలు అర్బన్, ఆదోని మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్ కర్నూలు అర్బన్, డిప్యూటీ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ శాఖల కు సంబంధించి వారం నుంచి పది రోజులైనా అర్జీలను చూడలేదని, అర్జీలను చూడకుంటే ఎలా అని కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు..ప్రజల అర్జీలకు సంబంధించి నిర్లక్ష్యం చేయకూడదని, లాగిన్ లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. అలాగే వచ్చిన అర్జీలను నిర్దేశిత గడువు లోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పిజిఆర్ఎస్ లాగిన్‌లో పరిష్కారం చేసిన అర్జీలను సక్రమంగా పరిష్కారం చేశారా లేదా అని ఆడిట్ చేయాల్సి ఉందన్నారు.. ఈ అంశం పై ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్డీఓ లు ఆడిట్ చేయడం లో పెండింగ్ ఉన్నాయని, వెంటనే ఆడిట్ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు..అలాగే పోలీస్ శాఖ , డిఆర్ఓ , ఏడి సర్వేయర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ల వద్ద కూడా ఆడిట్ పెండింగ్ లో ఉందని, వ్యక్తిగతన పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రీ సర్వే గ్రామ సభలకు సంబంధించి రీ ఓపెన్ అయిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సర్వే శాఖ అధికారిని ఆదేశించారు. అలాగే రెవెన్యూ సదస్సులకు సంబంధించిన అర్జీలను కూడా ద్వైతగతిన పరిష్కరించాలని కలెక్టర్ రెవిన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. సిఎంఓ గ్రీవెన్స్ లకు సంబంధించి పెండింగ్ లో ఉన్న అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 20, కర్నూలు ఆర్డీఓ వద్ద 10, పత్తికొండ ఆర్డీఓ వద్ద 7, సర్వే ఏడి వద్ద 2, డి ఎం హెచ్ ఓ, వ్యవసాయ శాఖ, మెప్మా, సైనిక సంక్షేమ శాఖ వద్ద 1 అర్జీ చొప్పున పెండింగ్ లో ఉన్నాయన్నారు.. సిఎంఓ గ్రీవెన్స్ లు పెండింగ్ ఉండకూడదని, ఎప్పటికపుడు పరిష్కారం చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు, అనురాధ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయండి

- పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బందితో మంత్రి టీ.జీ. భరత్ - పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత వారిదే బాధ్యత
- గార్బేజ్ పాయింట్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి - ప్రభుత్వ ఆస్తులపై బ్యానర్లు, పోస్టర్లు అతికిస్తే చర్యలు





**కర్నూలు పెన్ పవర్ మే 19 :** నగరంలో పారిశుద్ధ్య పనులను మరింత ముమ్మరం చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కమిషనర్ యస్.రవీంద్ర బాబుతో కలిసి పారిశుద్ధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు, మేస్త్రిలతో పారిశుద్ధ్యంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నగరంలో పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు ఎక్కువ అయ్యాయని, వాటిపై పర్యవేక్షక సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పునరావృతం అవుతున్న సమస్యలు ఫిర్యాదులు వచ్చేంత వరకు వేచి ఉండకుండా, ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో పారిశుద్ధ్య మెరుగుపడకపోతే, ఎక్కడైనా పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత సిబ్బందే బాధ్యత అని, వారిపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. పారిశుద్ధ్యంలో విశాఖపట్నం తరహాలో నగరాన్ని తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గార్బేజ్ పాయింట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని, రహదారులపై చెత్తా వేసే వారిని గుర్తించి హెచ్చరించాలని, అయినప్పటికీ వినకపోతే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారులు, కూడళ్లపై బ్యానర్లు, పోస్టర్లు అతికించే వారిపై సైతం చర్యలు తీసుకునేందుకు ఉపేక్షించొద్దని ఆదేశించారు. సిసి కెమెరాలకు అడ్డంగా ఏవైనా బ్యానర్లు కడితే ఆ సమయంలో అక్కడ ఏదైనా ప్రమాదం జరిగితే బ్యానర్లు కట్టిన వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, మురుగు కాలువలపై ఆక్రమణలు, కాలువలు ఎక్కుతక్కులను సరిచేయించుకునే బాధ్యత పారిశుద్ధ్య పర్యవేక్షక సిబ్బంది తీసుకోవాలని ఆదేశించారు. ఇంటింటి తరువాయి 4లో..

## వైభవంగా ముగిసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వసంతోత్సవాలు





**తిరుమల పెన్ పవర్ మే 19 :** శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన వసంతోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు.

**వసంతోత్సవములు ప్రాముఖ్యత :**

శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారికి శ్రీవిశ్వావసు నామ సంవత్సరం, వైశాఖ మాసంలో త్రయాహ్నిక దీక్షతో ఈ మూడు రోజులు శ్రవణ నక్షత్రం నాడు పరిసమాప్తి అయ్యే విధంగా వసంతోత్సవ సేవ వేఖానసాగ మోక్తంగా వసంతోత్సవాలను నిర్వహిస్తారు. వసంత ఋతువులో ప్రకృతి ద్వారా ఆవిర్భవించిన ఫలములు, పుష్పములు స్వామికి సమర్పించి సర్వజగద్రక్షకుడిగా సర్వాంతర్యామిగా స్వామిని ప్రార్థించి ఆ శ్రీనివాసుని దివ్యానుగ్రహం పొందుటయే ఈ వసంతోత్సవం యొక్క అంతరార్థం. ఉదయం 8.30 నుండి 9.00 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులు, శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి, రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుని ఉత్సవమూర్తులను వసంత మండపంలోకి వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. మధ్యాహ్నం 1.45 నుండి 3.30 గంటల వరకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వైభవంగా జరిగింది. ఇందులో ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రాజోపచారం నిర్వహించారు. అనంతరం ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం చేపట్టారు. అర్ఘ్యపాద్య నివేదనలో భాగంగా క్షీర(పాలు), దధి(పెరుగు), మది(తేనె), నారికేళం(కొబ్బరినీళ్లు), హరిద్రోదకం(పసుపు), గంధోధకం(గంధం)తో స్నపనం నిర్వహించారు. వీటిని చక్రధార, శంఖధార, సహస్రధార, మహాకలశాభిషేకాలను వైఖనస ఆగమయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలసూక్తం, విష్ణుసూక్తం, దశ శాంతి మంత్రములు, తైత్తరీయ ఉపనిషత్తు, దివ్య ప్రభందములో అభిషేక సమయంలో అనుసంధానము చేసే నిరాట్టమ పాశురాలను అర్చకులు పఠించారు. ఈ వేడుకలో ఒకో క్రతువులో ఒక మాల వంతున మొత్తం ఏడు రకాల మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. ఇందులో కురువేరు (వట్టివేరులో ఒకరకం), వట్టివేరు, రోజా, మల్లె, సంపంగి, గులాబి, దవణం, తులసి మాలలు స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. కాగా సాయంత్రం 6 నుండి 7 గంటల వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 నుండి 8 గంటల వరకు స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో పి.వరలక్ష్మీ, ఏఈవో ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్ వి.రమేష్ బాబు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు డి.మునికుమార్, ఎం.ధోనీ శేఖర్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు





**చిత్తూరు పెన్ పవర్ 19 :** ఈనెల 21న కుప్పంలో ప్రసిద్ధిగాంచిన అత్యంత వైభవంగా నిర్వహించే తిరుపతి ప్రసన్న గంగమాంబ గంగ జాతర సందర్భంగా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో అందుకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్ల పై సోమవారం మధ్యాహ్నం ప్రభుత్వ విప్ మరియు ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ జిల్లా ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి పరిశీలించారు. అడ్వాన్స్ సెక్యూరిటీ లైసెనింగ్ (ఏఎస్ఎల్)లో భాగంగా గుడిపల్లి మండలం ద్రావిడ యూనివర్సిటీ గ్రౌండ్ నందు హెలిపాడ్ లో బ్యారికేటింగ్ ఏర్పాటు, గ్రౌండ్ నందు శానిటేషన్ నిర్వహణ, సంబంధిత అంశాలపై చర్చించారు. అనంతరం పాతపేటలో వెలసిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయం వద్ద అమ్మ వారికి ముఖ్యమంత్రి పట్టు వస్రాలు సమర్పించడంలో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్ ఏర్పాట్ల పై ప్రభుత్వ విప్ మరియు ఏంఎల్సి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు ఆలయ చైర్మన్ రవిచంద్రబాబు తో చర్చించారు. ఈ ఏఎస్ఎల్ కార్యక్రమంలో టిటిడి పాలకమండలి సభ్యులు వైద్యం శాంతారామ్, ఎఆర్ అడిషనల్ ఎస్పీ నందకిషోర్, పిఆర్ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, డిస్టిక్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, కుప్పం ఆర్డిఓ శ్రీనివాసరాజు,ఏఆర్ డిఎస్ పి.మహబూబ్ బాషా, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రావు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పదవులు వచ్చినా రాకపోయినా క్రమశిక్షణ ముఖ్యం


### మినీ మహానాడులో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి



**పలమనేరు మే 19, (పెన్ పవర్) :** తెలుగుదేశం పార్టీలో పదవులు వచ్చినా రాక పోయినా క్రమశిక్షణ ముఖ్యమని ఎమ్మెల్యే అమర నాథరెడ్డి అన్నారు.సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ టిడిపి మినీ మహానాడు కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా నాయకుల నుద్దేశించి ఆయన ప్రసంగించారు.పార్టీని గ్రామస్థాయి నుంచి పటిష్టం చేసేందుకు ప్రతి నాయకుడు కృషి చేయాలన్నారు.పార్టీ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు చురుగ్గా పాల్గొనాలని నాయకులు సమన్వయంతో సమిష్టిగా కలిసి పనిచేసి ప్రభుత్వ పథకాలను అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సూపర్ సిక్స్ లో భాగంగా త్వరలో తల్లికి వందనం,ఉచిత బస్సులతో పాటు ఒక్కొక్కటిగా అన్ని హామీలను నెరవేర్చడం జరుగుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తే, ఎన్ని ఇబ్బందులున్నా బాబు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. నిత్యం ప్రజల్లో ఉండాలని నాలుగేళ్లు ప్రజలకు మంచి చేసి మీరు బలపడాలని, మీరు బలంగా ఉంటేనే పార్టీ బలంగా ఉంటుందన్నారు. నాయకులను అధికంగా రాజకీయంగా బలోపేతం చేయడానికి పార్టీ అండగా ఉంటుందని ఇక నామినేటెడ్ పదవులు వచ్చినా రాకపోయినా క్రమశిక్షణతో పార్టీ కోసం నిబద్ధతతో పనిచేయాలని, అటువంటి వారికి తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో హంద్రీనీవా లైనింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయని, ఈఏపీ మరియు ఉపాధి హామీ పథకం ద్వారా నియోజకవర్గంలోని అన్ని రోడ్లను పూర్తి చేస్తున్నామని వివరించారు. రాజకీయాల్లో అవకాశాలు వస్తూ ఉంటాయని గ్రామస్థాయి నుంచి మంత్రి దాకా ఎదగడానికి తనకు ఎన్టీఆర్ మరియు బాబు కల్పించిన అవకాశమే కారణమని పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉంటానన్నారు.పదవి ఉన్నా లేకపోయినా ఎన్టీఆర్ ఆశయ సాధన కనుగుణంగా బతికినంత కాలం పని చేస్తానని పేర్కొన్నారు. ఈనెల 27,28,29 తేదీలలో కడపలో జరగనున్న మహానాడు పండుగకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతనికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు మండల పార్టీ అధ్యక్షులు మరియు ముఖ్య నేతలు కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు.ఈ మహానాడు కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ జయప్రకాష్,మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ,రంగనాథ్,కుట్టి, సోమశేఖర్ గౌడ్, ఆనంద్,నాగరాజు రెడ్డి లతో పాటు సీనియర్ నాయకులు ఆర్.వి.బాలాజీ, రామచంద్ర నాయుడు, విజయ భాస్కర్ రెడ్డి, బ్రహ్మయ్య,సుబ్రహ్మణ్యంగౌడు,చౌడప్ప, చెంగారెడ్డి,ముబారక్, మహిళా నాయకురాళ్లు శివకుమారి,ప్రమీల, పర్వీన్,చంద్రకళ, తదితరులు ఉన్నారు.

## భారీ వర్షాలపై ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలి

### మండల, జిల్లా కార్యాలయాల్లో 24/7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయండి : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల, పెన్ పవర్ మే, 19 :** రానున్న 3 రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం వున్న నేపథ్యంలో ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమ అనంతరం అధిక వర్షాల పట్ల అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలను జారీ చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ రానున్న మూడు రోజుల్లో జిల్లాలో ఈదర గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని అందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఓ, తహశీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లను కలెక్టర్ ఆదేశించారు.

అదే విధంగా మండల, జిల్లా స్థాయిలో 24/7 సిబ్బందితో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు అందులో ఉన్న సిబ్బంది పేరు, ఫోన్ నెంబరుతో సహా కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలన్నారు. జిల్లాలో సుమారుగా 25 వేల వరకు మట్టి మిద్దెలు ఉన్నాయని అధిక వర్షాల వల్ల ఇళ్లలో ఉండడం సబబు కాదన్న విషయాన్ని విఆర్ఓల ద్వారా వారికి తెలుపుతూ అందుకు తగ్గ నోటీసులు జారీ చేసి సదురు కాపీని ఇంటికి కూడా అతికించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 21 వాగులు, కాలువలు ఉన్నాయని అందులో గుర్రపు డెక్క, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకపోకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

వాగుల ద్వారా వచ్చే నీరు కుందూ నదిలో కలుస్తున్నందున పరీవాహక ప్రాంతాల పరిసరాలను అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. అదే విధంగా ఈదురు గాలుల వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు పడే అవకాశం ఉంటుందని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పిడుగు పాటు వల్ల ఏ ఒక్కరూ మృతి చెందకూడదనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం ఏ మండలంలో, ఏ గ్రామంలో పిడుగు పాటు పడే అవకాశం ఉందన్న ఖచ్చితమైన సమాచారం ముందస్తుగా ఇవ్వడం జరుగుతుందని సదరు సమాచారాన్ని గ్రామ స్థాయి వరకు అందజేసి ఏ ఒక్కరూ ప్రమాదాలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా పాడి పశువులను కూడా జాగ్రత్తగా చూసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

## శతాబ్దాల అనంతరం శ్రీవారికి అఖండాలు విరాళం





**తిరుమల పెన్ పవర్ మే 19 :** రంగనాయకుల మండపంలో విరాళాన్ని అందించిన మైసూరు రాజమాత తిరుమల శ్రీవారికి మైసూరు రాజమాత శ్రీ ప్రమోదా దేవి రెండు భారీ వెండి అఖండాల (అఖండ దీపాలు)ను సోమవారం విరాళంగా అందించారు. ఈ అఖండాలు గర్భగుడిలో వెలిగించే సంప్రదాయ దీపాలు. సుమారు 300 సంవత్సరాల క్రితం అప్పటి మైసూరు మహా రాజు ఇలాంటి దీపాలను ఆలయానికి విరాళంగా అందించినట్లు చరిత్రలో ఉంది. ఇప్పుడు మళ్లీ మైసూరు రాజమాత వాటిని సమర్పించడం విశేషం. ఒక్కో వెండి అఖండం సుమారు 50 కిలోల బరువుంటుంది. తిరుమలలోని రంగ నాయకుల మండపంలో ఆమె ఈ భారీ వెండి అఖండాలను అందించారు. టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడు, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మెప్మా ఆధ్వర్యంలోని ఉత్పత్తులను కొనుగోలు చేయండి

### - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా




**నంద్యాల, పెన్ పవర్ మే 19 :** మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలచే తయారు చేసి విక్రయిస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేయాలనిజిల్లా కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైస్టోర్ యాప్ లో విక్రయిస్తున్న ఉత్పత్తులను ఆన్లైన్ లో ఓపెన్ చేసి జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలచే తయారు చేసే ఉత్పత్తులను మైస్టోర్ యాప్ ఆన్లైన్ మాధ్యమంలో విక్రయించడం జరుగుతుందని తద్వారా వారికి చేయూత ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ యాప్ లో ఇప్పటి వరకు 1200 వరకు ఉత్పత్తులను నాణ్యమైన పద్ధతిలో తయారు చేసి విక్రయించడం జరుగుతుందన్నారు. మైస్టోర్ లో బుక్ చేసే ఉత్పత్తులను థర్డ్ పార్టీ ప్రతినిధుల ద్వారా వినియోగదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం మైస్టోర్ యాప్ లో విక్రయిస్తున్న ఉత్పత్తులను ఆన్లైన్ లో ఓపెన్ చేసి జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు.

## మామిడి ఫ్యాక్టరీ యజమానులకు బ్యాంకు వారు అన్ని విధాలుగా సహాయ సహకారాలు : జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి పెన్ పవర్ మే 19 :** సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నుండి మామిడి ఫ్యాక్టరీ యజమానులకు బ్యాంకు వారు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, బ్యాంకు అధికారులతో కలిసి కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్ పర్చువల్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మ్యాంగో పల్ప్ ప్రాసెసింగ్ సంస్థలు గత రెండు సంవత్సరములుగా పల్ప్(జ్యూస్) అమ్ముడుపోనందున చాలావరకు సంస్థల నందు నిల్వలు ఉన్నాయని పేరుకు పోయిన నిల్వలు అధికంగా ఉన్నందున బ్యాంకు వారికి కట్టవలసిన. వడ్డీని 6 మాసములు పొడిగించవలసినదిగా గత సమావేశంలో కోరియున్నందున వారు కోరిన విషయాలను ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ వారితో మామిడి ప్రాసెసింగ్ యాజమాన్యం వారు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించగా వారు సానుకూలంగా స్పందించి ప్రత్యేక డిసిసి జరిపి ఈ అంశములను ఆమోదింపచేసి ప్రభుత్వానికి తెలియపరచ వలసినదిగా తెలిపి ఉన్నారని అన్నారు. అందులో భాగంగా నేడు ప్రత్యేక డిసిసి సమీక్ష సమావేశంలో అందరూ బ్యాంకు అధికారులు పాల్గొనడం జరిగిందన్నారు. ఈ సమీక్షలో అన్ని బ్యాంక్ అధికారులు మ్యాంగో పల్ప్ ప్రాసెసింగ్ సంస్థలకు 6 మాసముల పాటు వడ్డీని పొడిగించుటకు బ్యాంకుల వారు ఆమోదం తెలిపి ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారని తెలియజేసారు. ఈ సమావేశంలో ఉద్యానశాఖాధికాదికారి దశరథ రామి రెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ గుంటూరు రవికుమార్, ఇతర బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలననుసరించి సాధారణ బదిలీలు...

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ మే 19 :** ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల నిబంధనలను అనుసరించి మాత్రమే జిల్లా అధికారులు తమ పరిధిలోని ఉద్యోగులను బదిలీలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి.రాజ కుమారి అధికారులను ఆదేశించారు. సోమ వారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక అనంతరం సాధారణ బదిలీలు, స్వచ్ఛఆంధ్ర - స్వర్ణఆంధ్ర తదితర కార్యక్రమాపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి,సాధారణ బదిలీలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో, ఆ ఉత్తర్వులలోని నిబంధనలను ఏమాత్రం అతిక్రమించకుండ బదిలీల ప్రక్రియ చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛఆంధ్ర - స్వర్ణఆంధ్ర కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు. జూన్ మాసంలో నీరు-మీరు అనే థీమ్ తో పల్లె పుష్కరిణి అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉన్న ట్యాంకులను అభివృద్ధి చేయడానికి డ్వామా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నీటి తోట్ల చుట్టూ బండ్ పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా జనవరి నుండి ఇప్పటి వరకు నిర్వహించిన స్వచ్ఛఆంధ్ర - స్వర్ణఆంధ్ర కార్యక్రమాల ఫోటోలను అన్ని కార్యాలయాల్లో వాల్ రూపంలో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## ధ్వజారోహణంతో కార్వేటినగరం శ్రీ వేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవాలు



**తిరుపతి పెన్ పవర్ మే 19 :** కార్వేటినగరం శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం 9.15 గం.ల నుండి 9.45 గం.ల మధ్య మిథున లగ్నంలో వైభవంగా ప్రారంభమయ్యాయి. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ గరుడ చిత్రంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. అంతకుముందు ఉదయం 5.30 నుండి 9.00 గంటల వరకు ధ్వజప్రతిష్ఠ, రక్షాబంధనం, భేరీతాడనం, నవసంధి, బలిహారణం, తిరుమాడ వీధి ఉత్సవం సాగింది. రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ధ్వజపటం, చక్రత్తాళ్వార్, పరివార దేవతలు బంగారు తిరుచ్చిపై నాలుగు మాడ వీధుల్లో విహరించారు. ఈ ఊరేగింపు ద్వారా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను స్వామివారు ముందుగా పర్యవేక్షించి, 18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారని ప్రతీతి. ఈ రోజు రాత్రి 7 నుండి 9 గం.ల వరకు స్వామివారు పెద్ద శేష వాహనంపై విహరించి భక్తులను అనుగ్రహించనున్నారు. స్థల పురాణం - ఆకాశరాజు కుమార్తె పద్మావతీ దేవి కలియుగ దైవం శ్రీనివాసుల పరిణయానంతరం ఆకాశరాజు స్వర్గస్థుడు కాగా, అతని కుమారుడు వసుదాసుడు సంతానహీనుడై పూర్వము తమ పూర్వులకు అర్థరాజ్యం ఇచ్చిన నారాయణరాజు మునిమనుమడైన వేంకటరాజునకు నారాయణపుర రాజ్యమును అప్పగించి తాను వేంకటాచలమున తపస్సుచేసి శ్రీనివాసుని పాదారవిందముల ప్రాప్తి పొందగోరెను. వేంకటరాజు వంశమున వేంకట పెరుమాళ్రాజు తన పరిపాలన కాలమందు ఈ కార్వేటినగర నిర్మాణమును గావించి తిరుమలలో శ్రీ వేంకటాచలపతితో కూడి పూజింపబడుచున్న శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవతామూర్తులను తెప్పించి శ్రీ వేఖానసులవారిచే ప్రతిష్ఠింపజేసెను. ఈ ఆలయ నిర్వహణను రాజుల పరిపాలనానంతరం 1936 సంవత్సరం నుండి దేవాదాయ శాఖ నిర్వహించి, తదుపతి 1989 ఏప్రిల్ 10న తిరుమల తిరుపతి దేవస్థానమునకు అప్పగించబడినది. ఈ ఆలయంలో స్వామివారు సంతాన వేణుగోపాలస్వామిగా ఎంతో ప్రసిద్ధి పొందినారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి బి. నాగరత్న, ఆలయ అర్చకులు తరణ్ కుమార్, గోపాలా చార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ జీ.సురేష్ కుమార్, పలువురు భక్తులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు వాహన సేవలు జరుగనున్నాయి. మే 28న మధ్యాహ్నం 1.30 నుండి 3.30 గంటల వరకు పుష్పయాగం నిర్వహిస్తారు.

**బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు :**

తేదీ :

20-05-2025
ఉదయం- చిన్నశేష వాహనం
సాయంత్రం-హంస వాహనం

21-05-2025
ఉదయం-సింహ వాహనం
సాయంత్రం-ముత్యపుపందిరి వాహనం

22-05-2025
ఉదయం-కల్పవృక్ష వాహన
సాయంత్రం-ఆర్జిత కళ్యాణోత్సవం/ సర్వభూపాల వాహనం

23-05-2025
ఉదయం-పల్లకీపై మోహినీ అవతారం
సాయంత్రం-గరుడ వాహన సేవ

24-05-2025
ఉదయం-హనుమంత వాహనం
సాయంత్రం-సా - వసంతోత్సవం, రాత్రి - గజ వాహనం

25-05-2025
ఉదయం-సూర్యప్రభ వాహనం
సాయంత్రం-చంద్రప్రభ వాహనం

26-05-2025
ఉదయం-రథోత్సవం
సాయంత్రం-అశ్వవాహనం

27-05-2025
ఉదయం-చక్రస్నానం
సాయంత్రం-ధ్వజావరోహణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మే 22వ తేదీ సాయంత్రం 5 నుండి 6.30 గంటల వరకు స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరుగనుంది. రూ.750 చెల్లించి గృహస్తులు కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, ఒక లడ్డూ, ఒక అప్పం బహుమానంగా అందజేస్తారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహించనున్నారు.

## మానవతా దృక్పథంతో ప్రజా సమస్యలను పరిష్కరించండి

### పిజిఆర్ఎస్ కు 213 దరఖాస్తులు : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ మే19 :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను మానవతా దృక్పథంతో ఆలోచించి సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను మానవతా దృక్పథంతో ఆలోచించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని సమస్యలు నిబంధనలకు వ్యతిరేకంగా ఉంటే ఏ విధంగా చేస్తే సమస్య పరిష్కారం అవుతుందో ఆలోచించాలన్నారు. స్వీకరించిన ప్రతి సమస్యకు ఖచ్చితమైన పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీదారుల వినతులను సక్రమంగా పరిష్కరించని కారణంగా 49 దరఖాస్తులు రీఓపెన్ అయ్యాయని వీటన్నింటివి నాణ్యతతో తక్షణమే పరిష్కరించాలన్నారు. విఐపి దరఖాస్తులకు సంబంధించి పెండింగ్ లో వున్న 62 అర్జీలను త్వరితగతిన పరిష్కరించేలా చూడాలన్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారుల అభిప్రాయ సేకరణకు సంబంధించి ఇప్పటి వరకు 43.15 శాతం సేకరించడం జరిగిందని పెండింగ్లో ఉన్న డేటాను త్వరితగతిన సేకరించేలా చర్యలు తీసుకోవాలని డిఎల్డిఓలను కలెక్టర్ ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయ సర్వేలలో భాగంగా మన మిత్ర క్యాంపెయిన్ కు సంబంధించి ఇంకా 13,724 పెండింగ్ ఉందని, వర్క్ ఫ్రమ్ హోంకు సంబంధించి 2367 పెండింగ్లో ఉన్నాయని సంబంధిత సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. అలాగే మిస్సింగ్ సిటిజన్స్ కు సంబంధించి 712, సిటిజెన్ ఈకేవైసి 2,34,772 మందికి పెండింగ్ లో ఉన్నాయన్నారు. చిల్డ్రన్ విథౌట్ ఆధార్ 7800, హౌసింగ్ ఇమేజ్ జియో కోఆర్డినేట్ కు సంబంధించి 626 పెండింగులో ఉన్నాయని వాటిని తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని సమస్యలు.**

1) దొర్నిపాడు మండలం చాకిరాజువేముల గ్రామ కాపురాస్తురాలు రమాదేవి తన భర్త మరణించి సంవత్సరం అవుతుందని... తనకు ఇద్దరు పిల్లలున్నారని ఎలాంటి జీవనాధారం లేని నాకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు ను సమర్పించుకున్నారు.

2) బేతంచెర్ల మండల కేంద్రంలోని కాపురస్తూరాలు పద్మావతమ్మ తనకు సర్వే నంబర్ 527/1ఎలో 0.42 సెంట్లు బేతంచెర్ల బైపాస్ రోడ్డు కు తీసుకున్నారని... సంబంధిత పొలంలో బావి మరియు ఒక రూం ఉందనీ పొలానికి మాత్రమే డబ్బులు మంజూరు చేశారు కానీ బావికి రూంకి డబ్బులు మంజూరు చేయలేదని... నా సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించుకున్నారు.

3) కోవెలకుంట్ల మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ రెహమాన్ తనకు సర్వే నంబర్ 55/ఎ3ఎలో 1.36 సెంట్ల పట్టా భూమి ఉన్నదనీ... సంబంధిత భూమి నిషేధిత జాబితాలో ఉన్నట్లు ఆన్లైన్లో, రెవెన్యూ రికార్డులలో పట్టా భూమిగా ఉందనీ... ఆన్లైన్లో నిషేధిత భూమి నుంచి తొలగించవలసినదిగా కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో 213 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# రెగ్యులర్ విసిని నియమించాలి

### యోగి వేమన యూనివర్సిటీలో ఉన్న సీనియర్లను ఇన్చార్జి వైస్ ఛాన్సలర్‌గా నియమించాలి : ఏఐఎస్బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్




**కడప పెన్ పవర్ మే 19 :** యోగి వేమన యూనివర్సిటీ కి రెగ్యులర్ వైస్ ఛాన్స్ లర్ లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యోగి వేమన యూనివర్సిటీ పరిధిలోని సమస్యలను పరిష్కరించడానికి అధికారి లేకుండా పోయారని వెంటనే యోగి వేమన యూనివర్సిటీకి రెగ్యులర్ వైస్ ఛాన్స్ లర్ ను, లేదా యోగి వేమన యూనివర్సిటీలో సీనియర్ అధికారులు ఇన్చార్జి వైస్ ఛాన్స్ లర్ గా నియమించి, విద్యార్థుల యొక్క సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరంలోని ఓంశాంతి నగర్ లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయం ముందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యోగి వేమన యూనివర్సిటీ కి గత కొన్ని నెలలుగా ఛాన్సలర్ లేకపోవడంతో సమస్యలు రోజురోజుకీ పెరిగిపోతున్నా యని, విక్రమ్ సింహపురి యూనివర్సిటీ కి రెగ్యులర్ వైస్ ఛాన్సర్ గా ఉన్న అల్లం శ్రీనివాసులు ని ప్రభుత్వం యోగి వేమన యూనివర్సిటీ ఇన్చార్జి వైస్ ఛాన్స్ లర్ గా నియమించడం వల్ల కేవలం పది రోజులకు ఒకసారి మాత్రమే యూనివర్సిటీకి వచ్చి ఏదైనా ఫైలు మీద సంతకం పెడుతూ మరుసటి రోజు వెళ్ళిపోతున్నారని, విద్యార్థులు సమస్యలను వి.సి దృష్టికి తీసుకెళ్లాలి అన్న కూడా అందుబాటులో లేకపోవడంతో సమస్యల రోజు రోజుకి పెరిగిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల యొక్క సమస్యలను వి.సి గాలికి వదిలేసారని వారు వాపోయారు. ఇంత పెద్ద యోగి వేమన యూనివర్సిటీకి రెగ్యులర్ విసి లేకపోవడం చాలా బాధాకరమని, ఎక్కడో నెల్లూరు జిల్లాలో ఉన్న వీ.సీ ని తెచ్చి ఇక్కడ ఇన్చార్జ్ వి.సీ గా నియమించడం వల్ల సమస్యలు పెరిగిపోతున్నాయని, యోగి వేమన యూనివర్సిటీలో ఉన్న సీనియర్ అధికారులకు ఇంచార్జ్ వైస్ ఛాన్సర్ బాధ్యతలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. యోగివేమన యూనివర్సిటీకి రెగ్యులర్ వైస్ ఛాన్సర్ నియమించేంతవరకు ఇతర విద్యార్థి సంఘాలను కలుపుకొని పోరాటం కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

## పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయండి

(3వ పేజీ తరువాయి) చెత్తా సేకరణ వంద శాతం చేపట్టాలని, రహదారులపై, మురుగు కాలువల్లో చెత్తాచెదారం వేస్తే కలిగే అనర్థాలను ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. నగరంలో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, తద్వారా కర్నూలుతో పాటు సమీప మున్సిపాలిటీల్లో వెలువడే వ్యర్థాలతో విద్యుత్ తయారు చేయవచ్చన్నారు. మురుగు కాలువల్లో ఉన్న తాగునీటి పైప్‌లైన్‌లను తొలగించేందుకు ప్రతిపాదనలను రూపొందించాలని కమిష నర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్ రెడ్డి, పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి నాగరాజు, ఇంచార్జీ యస్ఈ శేషసాయి, ఎంఈ సత్యనారాయణ, పట్టణ ప్రణాళిక సర్వేయర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తకాలు కోసం... మానవతా దృక్పథంతో




**కడప పెన్ పవర్ మే 18 :** కడప మానవతా సంస్థ ,పదవ తరగతిలో 556 మార్కులు సంపాదించిన యూసఫ్ అనే విద్యార్థికి ఇంటర్మీడియట్ పుస్తకాలు కొనుటకై ఆరువేల రూపాయల ను సహాయం చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ డైరెక్టర్ రాటాల గోపి ,జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. సుబ్బారెడ్డి ,రిటైర్డ్ ప్రిన్సిపల్ శ్రీ సుబ్బి రెడ్డి గారు ,సాయి విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ భూపతి రాయల్ గారు పాల్గొన్నారు.

## తట్టు-రూబెల్లా నివారణకు టీకా ఒక్కటే మార్గం

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల, పెన్ పవర్ మే 19 :** తట్టు-రూబెల్ల వ్యాధి నివారణకు టీకా తీసుకోవడం ఒక్కటే మార్గమని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక అనం తరం నేషనల్ జీరో మీజిల్స్-రుబెల్లా ఎలిమినేషన్ క్యాంపెయిన్ కార్యక్రమం (2025-26)లో జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ తట్టు-రూబెల్లా నివారణకు టీకా ఒక్కటే మార్గమన్నారు. 9 నెలల నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఎంఆర్-1, ఎంఆర్-2 వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తట్టు-రూబెల్లా వ్యాధిని రూపుమాపేందుకు గాను నేషనల్ జీరో మీజిల్స్-రుబెల్లా ఎలిమినేషన్ క్యాంపెయిన్ ను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. అందుకు గాను 0-5 సం.ల పిల్లలకు తప్పనిసరిగా 3 టీకాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో 0-5 సం.ల పిల్లలు 2,34,282 మంది ఉన్నారని అందులో (9-59నెలల) వారికి 27,540 మందికి, రెండవ టీకా 26,410 మందికి ఇవ్వడం జరిగిందన్నారు. చాలా మంది రెండు టీకాలు మాత్రమే తీసుకొని ఆపేస్తున్నారని అలా కాకుండా మొత్తం మూడు టీకాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అందుకు మొదటి విడత మే 26 నుండి 31 మే వరకు, రెండవ రౌండు 23వ తేది జూన్ నుండి 28 జూన్ వరకు, మూడవ రౌండు జూలై 21వ తేది నుండి జూలై 26వ తేది వరకూ నిర్వహించడం జరుగుతుందన్నారు. అందుకు జిల్లాలో ఉన్న చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. 2026వ సంవత్సరం లోపు తట్టు, రూబెల్లా వ్యాధిని నిర్మూలించాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఈ మేరకు ఐసిడిఎస్, పంచాయితీ రాజ్, విద్యాశాఖ, రెవెన్యూ శాఖ తదితర లైన్ డిపార్ట్మెంట్లు సహకరించి మూడు విడుతలుగా జరిగే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## పిజిఆర్ఎస్‌కు 256 అర్జీలు



**చిత్తూరు, పెన్ పవర్ మే 19 :** సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని గ్రీవెన్స్ హాల్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తో పాటు డిఆర్ఓ కె. మోహన్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనుపమ, విజయలక్ష్మి, చిత్తూరు ఆర్డిఓ శ్రీనివాసులు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.

మొత్తం: 256 అర్జీలు

ఇందులో శాఖల వారీగా అర్జీల వివరాలు :

రెవెన్యూ మరియు సర్వే శాఖ కు 198, పోలీసు శాఖ 13, డి ఆర్ డి ఏ 11, విద్యుత్ శాఖ 7, రహదారులు మరియు భవనముల శాఖ 1, పౌర సరఫరాల శాఖ 7, పశుసంవర్ధక శాఖ 2, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ 4, వాటర్ రిసోర్స్ 4, దేవదాయ శాఖ 1, విద్యాశాఖ 2, కలెక్టరేట్ ఏవో 2, డిసిసి బ్యాంక్ 1, ఎంపీడీఓ పాలసముద్రం 1, హౌసింగ్ 2 వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులు సమస్యలను జెసి, డిఆర్ఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు, చిత్తూరు ఆర్డిఓ లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిద శాఖలకు సంబందించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రాజెక్టు పర్యవేక్షణ సమూహం



**తిరుపతి పెన్ పవర్ మే 19 :** ఏపీ సచివాలయంలోని సిసిఎల్ఎ కార్యాలయం నుంచి సోమవారం రాష్ట్ర ప్రాజెక్ట్ పర్యవేక్షణ సమూహం (State Project Monitoring Group - SPMG), ప్రిపరేషన్ ఫర్ యోగ డే, కన్స్ట్రక్షన్ ఆఫ్ టాయిలెట్స్ ఇన్ ఆల్ కోర్టు కంప్లెక్,తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్. జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మే 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించాలి



**కర్నూలు, పెన్ పవర్ మే 19 :** జూన్ 21 వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఇందులో భాగంగా జిల్లా స్థాయి నుండి గ్రామ స్థాయి వరకు మే 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర క్యాంపెయిన్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం సెక్రటేరియట్ నుండి అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లు,స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, కోర్టు సముదాయాలలో మరుగుదొడ్ల నిర్మాణం, ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయం అంశాల పై చీఫ్ సెక్రటరీ జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జూన్ 21వ తేదీన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాన్ని విశాఖపట్టణంలో నిర్వహిస్తారని, ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి ముఖ్యమంత్రి పాల్గొంటారని తెలిపారు.. జిల్లాల్లో గ్రామ గ్రామాన ప్రజలు యోగా దినోత్సవంలో పాల్గొనేలా, విజయవంతంగా యోగా దినోత్సవ కార్యక్రమాలను నిర్వహించాలని సి.ఎస్ ఆదేశించారు. మే 21 న యోగా దినోత్సవం కర్టెన్ రైజర్గా ప్రతి జిల్లాలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి మండలంలోనూ మాస్టర్ ట్రైనర్లను గుర్తించాలని సూచించారు. మే 21 నుంచి 27 వరకు జిల్లా స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఉంటుందని, మే 28 నుంచి జూన్ 3 వరకు మండల స్థాయిలోనూ, జూన్ 4 నుంచి జూన్ 16వ తేదీ వరకు గ్రామ స్థాయిలో ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. యోగాపై అవగాహన కలిగే విధంగా ర్యాలీలు, రంగోలి, కాంపిటీషన్స్ నిర్వహించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించి పెద్ద పెద్ద పనులను స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో పర్యవేక్షణ చేయడం జరుగుతుందని, ఆయా జిల్లాలకు సంబంధించి ప్రాజెక్టు పనులలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు. జిల్లా కోర్టులు, సబార్డినేట్ కోర్టులలో దెబ్బతిన్న మరియు కొత్త టాయిలెట్స్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు సేవలపై వచ్చే ప్రజా స్పందనలపై తేలికగా తీసుకోకుండా జిల్లా కలెక్టర్లు సమీక్ష చేసి నిరంతరం పర్యవేక్షణ చేయాలని సీ ఎస్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ మే 19 :** ఈ నెల 21వ తేది నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో అందరి చేత యోగ నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుండి అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్, అంతర్జాతీయ యోగా దినోత్సవం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నుండి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో అందరి చేత యోగ నిర్వహించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రజాప్రతినిధులను కూడా భాగస్వామ్యం చేయడంతో పాటు అందరికీ ఆహ్వాన కార్డులు అందజేయాలని డిఆర్ఓను కలెక్టర్ ఆదేశించారు. ఇండోర్ స్టేడియంతో పాటు పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున శానిటేషన్ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ను ఆదేశించారు. అదే విధంగా యోగ డే కోసం చక్కటి బ్యాక్ డ్రాప్ ఏర్పాటు చేసి కర్టెన్ రైజర్స్ సిద్ధం చేయాలని డిఎస్డిఓ, డిఎంహెచ్ఓ, మున్సిపల్ కమీషనర్ లను ఆదేశించారు. అలాగే కార్యక్రమంలో యోగ అసోసియేషన్ సభ్యులు, విద్యార్థులను, యోగా కోచ్ లను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలన్నారు. నెల రోజుల పాటు జరిగే యోగ కార్యక్రమాలకు జిల్లా, మండల, గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలసి వుందన్నారు.

అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ స్టేట్ ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూప్ ద్వారా రాష్ట్రంలో ఉన్న వివిధ ప్రాజెక్టుల్లో పురోగతి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. 50 కోట్లకు పైబడి ఉన్న ప్రాజెక్టులను నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో సమీక్ష చేయడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఈ సమీక్ష ద్వారా వివిధ శాఖలకు సంబంధించిన అంశాలు నేరుగా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో ఉన్న ప్రాజెక్టులో జిల్లా కలెక్టర్ నేరుగా సమీక్ష నిర్వహించి పురోగతి సాధించాలన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈ నెల 21వ తేది నుండి ప్రారంభించి నెల మొత్తం జూన్ 21వ తేది వరకు యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్ అనే నినాదంతో వివిధ కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి గారు విశాఖపట్నంలో పాల్గొని ప్రారంభించడం జరుగుతుందన్నారు. యోగ మన జీవితంలో భాగస్వామ్యం చేసుకోవడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అందుకు ఈ కార్యక్రమాల్లో ప్రజలను, విద్యార్థులను, యువతను పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. పబ్లిక్ పర్సెప్షన్ (ప్రజా అభిప్రాయం)కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న సదుపాయాలు, పౌర సేవలపై వారు సంతృప్తిగా ఉన్నారా లేదా అని ఎప్పటికపుడు కలెక్టర్లు సమీక్ష నిర్వహించుకోవాలన్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల అభిప్రాయాన్ని సంతృప్తికరంగా ఉండే విధంగా క్రింద స్థాయి అధికారులతో చర్చించి ప్రభుత్వం పట్ల ప్రజల మన్ననను చూరగొనేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయండి

### - గుత్తేదారుల సమావేశంలో మంత్రి టీజీ భరత్ - సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా





**కర్నూల్ పెన్ పవర్ మే 19 :** నగరంలో నగరపాలక అభివృద్ధి పనులను టెండర్ ద్వారా దక్కించుకున్న గుత్తేదారులు పనులను జాప్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో మంత్రి, కమిషనర్ యస్.రవీంద్ర బాబు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి గుత్తేదారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా గుత్తేదారుల వారీగా చేపట్టిన పనుల పురోగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ మాట్లాడుతూ.. టెండర్ వేసి పనులు దక్కించుకుని పనులు ప్రారంభించకపోవడం ఎంత మాత్రం సబబు కాదని, జాప్యం చేయడం వల్ల ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు చెడ్డపేరు వస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లుల చెల్లింపు ప్రక్రియ సులభ తరం చేస్తోందని, సిఎఫ్ఎంఎస్ ప్రక్రియలో మున్సిపల్ బిల్లుల విషయమై నూతన విధానాన్ని తీసుకొస్తుందని వెల్లడించారు. గుత్తేదారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని, ఈ నెలాఖరులోగా నగరంలో అన్ని పనులను ప్రారంభించాలని సూచించారు. పనులు సకాలంలో పూర్తి కాకపోతే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని, పనులను రద్దు చేస్తామని స్పష్టం చేశారు, ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకోరావాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ ఎస్ఈ శేషసాయి, ఎంఈ సత్యనారాయణ, డిఈఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలు నేపథ్యంలో ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలి

### - జిల్లాలో 20 చెరువులు 100 శాతం నిండాయి - మరో 20 చెరువులు 75 శాతం నిండాయి



**అనంతపురం, పెన్ పవర్ మే 19 :** భారీ వర్షాలు నేపథ్యంలో ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ తెలిపారు. భారీ వర్షాల వల్ల జిల్లాలో 20 చెరువులు 100 శాతం నిండాయన్నారు. మరో 20 చెరువులు 75 శాతం నిండాయన్నారు. కనుక పరిసర ప్రాంత ప్రజలు మరియు ఆయకట్టు పరివాహక గ్రామాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులలో తప్ప బయటకు రాకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితులలో సహాయం కొరకు జిల్లా కలెక్టర్ గారి కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ కు 8500292992 కాల్ చేసి వివరాలు తెలపాలన్నారు.

**100 శాతం నిండిన చెరువుల వివరాలు..**

బెలుగుప్ప మండలం బీజకుండరి ఎంఐ ట్యాంక్ (సీర్పి)

గార్లదిన్నె మండలంలోని పెనకచర్ల, ఎర్రగుంట్ల, కోటంక.

గుత్తి మండలంలోని గుత్తి ఎంఐ ట్యాంక్ (ఆర్ఏటి), మామదురు ట్యాంక్, ములవాని చెరువు, బ్రాహ్మణపల్లి ఊర చెరువు.

గుంతకల్లు మండలంలోని నాగసముద్రం ఎంఐ ట్యాంక్, రాగులపాడు చెరువు, ఊర చెరువు. పామిడి మండలంలోని అనుంపల్లి ఎంఐ బిగ్ ట్యాంక్, బూదవాని చెరువు, పాళ్యం ఎంఐ ట్యాంక్, సూరకాయలపేట చెరువు.

పెద్దవడుగూరు మండలంలోని చిత్రచేడు ఎంఐ ట్యాంక్.

రాప్తాడు మండలంలోని గొందిరెడ్డిపల్లి ట్యాంక్.

వజ్రకరూరు మండలంలోని పల్లెచెరువు, జిల్లేదార్ చెరువు, చెట్టికుంట చెరువులు పూర్తిగా 100 శాతం నిండాయి.

**75 శాతం నిండిన చెరువుల వివరాలు..**

అనంతపురం రూరల్ పరిధిలోని కామారుపల్లి ట్యాంక్, కురుగుంట ట్యాంక్, కొడిమి, పాములాయి ట్యాంక్.

ఆత్మకూరు మండలంలోని మదిగుబ్బ ట్యాంక్, తోపదుర్తి బిగ్ ట్యాంక్.

బుక్కరాయసముద్రం మండలంలోని అనంతసాగర్ (అనంతపురం) ట్యాంక్, చెన్నంపల్లి చిన్నకృష్ణమ్మ ట్యాంక్, కెకె.అగ్రహారం ట్యాంక్.

గుంతకల్లు మండలంలోని పికె.చెరువు, వైటి.చెరువు ఎంఐ ట్యాంక్.

పామిడి మండలంలోని రామగిరి ట్యాంక్.

రాప్తాడు మండలంలోని బుక్కచెర్ల ట్యాంక్, ఊరుముందర చెరువు (బండమీదపల్లి ట్యాంక్).

ఉరవకొండ మండలంలోని బూదిగవి ట్యాంక్.

విడపనకల్లు మండలంలోని డొనేకల్ ట్యాంక్, హావళిగి ఆనికట్ స్కీం. వజ్రకరూరు మండలంలోని భూమిరెడ్డికుంట, దాసప్పకుంట, జె.రామాపురం ఎంఐ ట్యాంక్ 75 శాతం నిండాయన్నారు. ఆయా పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

### ప్రభుత్వ నిబంధనలను అనుసరించి మాత్రమే సాధారణ బదిలీలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి



**అనంతపురం, పెన్ పవర్ మే 19 :** పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశించారు.అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డిఆర్ఓ ఏ.మాలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ జి.రామకృష్ణారెడ్డి, డిప్యూటీ కలెక్టర్ లు రామ్మోహన్, తిప్పేనాయక్, ఆనంద్, వ్యవసాయ శాఖ జేడి ఉమా మహేశ్వరమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 460 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారులు నుండి స్వీకరించిన అర్జీల పరిష్కారంపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సదరు అర్జీలను నిర్ణీత గడువులోగా అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యతగా పరిష్కరించాలన్నారు.ప్రతి అర్జీని సమగ్రంగా పరిశీలించి వాటిలో పేర్కొన్న సమస్యలపై ఆచారణాత్మకమైన పరిష్కారం కలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే కార్యాలయాలకు విచ్చేసే ప్రజలతో సైతం మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి మాత్రమే సాధారణ బదిలీలు చేపట్టాలి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసి,సాధారణ బదిలీలు చేపట్టాలని ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ,ఆ ఉత్తర్వులలోని నిబంధనలను అనుసరించి మాత్రమే జిల్లా అధికారులు తమ పరిధిలోని ఉద్యోగులను బదిలీ చేయాల్సి ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా ఉత్తర్వులలోని నిబంధనలను ఏమాత్రం అతిక్రమించరాదన్నారు.

**కాలం చెల్లిన వాహనాలను వేలం వేయాలి.**

వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో నిరుపయోగంగా ఉన్న కాలం చెల్లిన వాహనాలను నిబంధనలను అనుసరించి వేలం వేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఇందుకు సంబంధించి జిల్లా రవాణా కమిషనర్ కు అధికారులు లేఖలు రాస్తే వాటికి అనుగుణంగా మోటార్ వాహన ఇన్స్పెక్టర్లను ఆయా కార్యాలయాలకు పంపుతారన్నారు. వాహనాలు ఉంచిన లొకేషన్ సైతం డి టి సి కి తెలియజేయాలన్నారు. వారు ఆ కార్యాలయంలోని వాహనాలను పరిశీలించి వాటి స్థితిగతులపై నివేదిక అందిస్తారని సూచించారు. అలాగే కార్యాలయంలోని పనికిరాని ఈ వేస్టేజ్ మరియు ఇతర సామాగ్రిని సైతం నియమ నిబంధనల మేరకు వేలం వేయాలని, అందుకు సంబంధించి వారి శాఖలకు చెందిన ఉన్నతాధికారుల నుంచి అనుమతి పొందాలన్నారు. వేలం వేసిన అనంతరం సంబంధిత రికార్డుల్లో వివరాలను పొందుపరచి ఆ రికార్డుల నుంచి వాటిని తొలగించాలన్నారు. ఈ ప్రక్రియను జూన్ 20వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఈఓ రామచంద్ర రెడ్డి, డిపిఓ నాగరాజు నాయుడు, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప, డిసిఓ అరుణకుమారి, ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, డిఎండబ్ల్యూఓ రామ సుబ్బారెడ్డి, ఎల్డిఎం నరేష్ రెడ్డి, హౌసింగ్ పీడీ శైలజ, సిపిఓ అశోక్ కుమార్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, సర్వే ఏడి రూప్ల నాయక్, జిల్లా మలేరియా అధికారి ఓబులు, డ్వామా పిడి సలిం భాష, పిఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, డిఈఓ ప్రసాద్ బాబు, సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు,డిసిహెచ్ఎస్ డా.పాల్ రవికుమార్,డిటిసి వీర్రాజు, మార్కెటింగ్ ఎడి సత్యనారాయణ చౌదరి, మైన్స్ డిడి వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి సోషల్ వెల్ఫేర్ జేడి రాధిక, ,డి టి డబ్ల్యూ ఓ రామాంజనేయులు, పిజిఆర్ఎస్ తహసీల్దార్ వాణిశ్రీ, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మనోబంధు సేవలు అమూల్యమైనవి : ఫౌండర్ చైర్మన్ రామకృష్ణమరాజు



**కడప పెన్ పవర్ మే 19 :** కడప మానసిక వైద్యశాలను సందర్శించిన మనోబంధు సభ్యులు. ఈ దినం 18.5.2025న మనోబంధు సభ్యులు అయిన పుత్తా శివ మరియు అనసూయ మరియు వారి టీమ్ సభ్యులు శివప్రసాద్ కలిసి కడప మానసిక వైద్యశాలను సందర్శించడం జరిగింది. అనసూయ టీమ్ సభ్యులు అందరిని ఆప్యాయతగా పలకరించడం జరిగింది. అనసూయ మరియు వారి టీమ్ సభ్యులు శివప్రసాద్ మాబూ వలి మాట్లాడుతూ.. మనోబంధు అనాథ మానసిక రోగుల కోసం గొప్పసేవచేస్తుందని, మేము కూడా మనోబంధుతో కలిసి సామాజిక కార్యకర్తలు గా పనిచేస్తామని ఈ సందర్భంగా వారు చెప్పడం జరిగింది. తరువాత అనసూయ మాట్లాడుతూ తొందరలో మహిళా మానసిక రోగులకు సరైన బట్టలు తెచ్చిస్తానని ఈ సందర్భంగా హామి ఇవ్వడం జరిగింది.

## మిషన్ శక్తి వన్ స్టాప్ సెంటర్ యొక్క పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్




**తిరుపతి, పెన్ పవర్ మే 19 :** మిషన్ శక్తి కింద కొత్తగా జిల్లా ప్రారంభమైన తరువాత మిషన్ శక్తి వన్ స్టాప్ సెంటర్ తిరుపతి జిల్లా నందు ప్రభుత్వ ప్రసూతి వైద్యశాల వైద్యశాలలో ప్రారంభించబడినది తెలిపారు. ఇందులో భాగంగా మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా, లైంగిక హింసలకు మరియు పనిచేసే ప్రదేశాలలో హింసకు గురి అవుతున్నవారు అన్నారు. యాసిడ్ దాడులు,అక్రమ రవాణా, గృహహింస, బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు , కిడ్నాపింగ్, సైబర్ నేరాలకు గురి అవుతున్న మహిళలకు ఒకే ప్రదేశంలో సేవ అందించటానికి సెంట్రల్ గవర్నమెంట్ ఆదేశాల మేరకు హింసకు గురి అయిన మహిళలకు మిషన్ శక్తి వన్ స్టాప్ సెంటర్ నందు ఉచిత న్యాయ రక్షణ వైద్య కౌన్సిలింగ్ మరియు వసతి సహాయం కలదని తెలిపారు. ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181 గురించి అవగాహన ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులు, శిశు సంక్షేమ శాఖ అధికారి వసంత బాయి, డిఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, డిసిహెచ్ఎస్ ఆనందమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ఎక్కువ కేసులు పరిష్కార దిశగా...

**అనంతపురం పెన్ పవర్ మే 19 :** జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ న్యూఢిల్లీ వారి ఆదేశాల మేరకు గౌరవనీయ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ అమరావతి వారి సూచనల మేరకు జూలై నెలలో 5వ తారీఖున జరగబోవు జాతీయ లోక్ అదాలత్ నందు ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యే విధంగా చేపట్టాల్సిన చర్యల గురించి ఈరోజు గౌరవనీయ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్యక్షులు మరియు ప్రధాన న్యాయమూర్తి గారైన శ్రీ ఈ. భీమారావు గారు మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి గారైన శ్రీ ఎన్. రాజశేఖర్ గారు ఈ రోజున ఉమ్మడి జిల్లాకు చెందిన ఎస్పీలు, రెవెన్యూ అధికారులు, జిల్లా జైలు అధికారులు, డి సి ఆర్ బి అధికారులు మరియు ఇతర శాఖలకు చెందిన జిల్లా అధికారులతో ఈరోజు సమావేశమై, రాబోయే జాతీయ నేషనల్ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చేపట్టాల్సిన చర్యలను గురించి జిల్లా జడ్జిగారు వివరించారు. ఈ కేసులు పరిష్కారం విషయం లో ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా న్యాయ సేవవాధికార సంస్థ కార్యదర్శి గారైన ఎన్. రాజశేఖర్ని సంప్రదించవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్కు క్యాన్సర్?



**అంతర్జాతీయ పెన్ పవర్ మే 19 :** ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన బైడెన్ కార్యాలయం. తాజాగా నిర్వహించిన వైద్య పరీక్షల్లో బైడెన్కు క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ అయినట్లు వెల్లడి. జో బైడెన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.

## నిందితులను కఠినంగా శిక్షించాలి : సీపీఎం




**శ్రీకాళహస్తి /పెన్ పవర్/ ప్రతినిధి/మే 19 :** ఇంజినీరింగ్ విద్యార్థి జేమ్స్పై పాశవికంగా దాడి చేసిన కులాహంకార నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి డిమాండ్ చేశారు. జేమ్స్ పై దాడికి నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. మణి మాట్లాడుతూ స్వాతంత్రం సిద్ధించి 78 ఏళ్ళు కావస్తున్నా సమాజంలో ఇంకా కుల దురహంకార దాడులు జరగడం సిగ్గు చేటన్నారు. జేమ్స్ పై అగ్రవర్ణ విద్యార్థులు జరిపిన దాడి అత్యంత జగుప్సాకరమైన, సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జేమ్స్ ఘటనను తీవ్రమైన నేరంగా భావించి, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, రాధమ్మ, కుమార్, వేణు, వెంకటేష్,, రాజా, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

## మానవతా సేవలు మరువలేనివి



**కడప పెన్ పవర్ మే 19 :** కడప పట్టణంలో నెలకొని ఉన్న తీవ్ర వేసవి దృష్ట్యా పట్టణ ప్రజల సౌకర్యార్థం 22వ రోజు ఉదయం 10-30గంటలకు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ దగ్గర ఏర్పాటుచేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం రిటైర్డ్ ప్రధానాచార్యులు ప్రొఫెసర్ జి సాంబశివరెడ్డి, డాక్టర్ మద్దిక సుబ్బిరెడ్డి రిటైర్డ్ ప్రిన్సిపల్ గారిచే కార్యక్రమం ప్రారంభించబడడం జరిగినది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ డాక్టర్ ఆవటాల రామాంజుల రెడ్డి, రాటాల గోపి, రిలయన్స్ మాధవరెడ్డి, హరినాథ్ రెడ్డి రిటైర్డ్ లెక్చరర్, భూపతి రాయల్, ఇతర మానవతా కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది. దాదాపు 2000 మందికి ఈరోజు మజ్జిగ మరియు చల్లని నీరు ప్రధానం చేయడం జరిగింది. ప్రతిరోజు ఈ కార్యక్రమం కొనసాగుతుందని కావున మానవతా సభ్యులందరూ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరుచున్నాను. రేపు అనగా 20వ తేదీ మంగళవారం వాతావరణం చల్లబడినందువల్ల ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేయడం జరిగినది. మానవతా కుటుంబ సభ్యులందరూ గమనించ వలసినదిగా కోరుచున్నాము.

## రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయండి : జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప, పెన్ పవర్ మే 19 :** ఈ నెల 26 నుండి 29వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాలులో రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై.. జేసీ అదితిసింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, నగర కమీషనర్ మనోజ్ రెడ్డి లతో కలిసి జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 26వ తేదీ నుండి 29వ తేదీ వరకు జిల్లాలో పర్యటిస్తారన్నారు. కడప నగర సమీపంలోని పబ్బాపురం గ్రామ పరిధిలో జరిగే “మహానాడు” కార్యక్రమంలో పాల్గొని నిమిత్తం జిల్లాకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రికి అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు పాటించేలా సంబందిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్దంగా గట్టి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనలో భాగంగా విధులు కేటాయించిన అధికారులందరూ.. ప్రోటోకాల్ నిబంధనలను తూచా తప్పక పాటించాలన్నారు. ప్రధానంగా రాష్ట్ర మంత్రులతో పాటు హాజరయ్యే వివిధ హోదాల్లోని ప్రజా ప్రతినిధులకు ప్రొటోకాల్ మేరకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే సభా ప్రాంగణం, పరిసరాలలో పారిశుద్ధ్య పనులు పక్కాగా వుండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పాల్గొనే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా వుండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భద్రతా, పార్కింగ్ అంశాలలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రధానంగా విద్యుత్, రహదారులు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, ఏర్పాట్లతో పాటు పోలీసు, ఫైర్, ఏమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ ను కూడా అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్, గ్రీవిన్స్ డెస్క్ లను ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. ఈ మేరకు విధులు కేటాయించిన అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ.. రాష్ట్ర ముఖ్య మంత్రి పర్యటనకు ప్రణాళిక బద్దంగా ఏర్పాట్లను పూర్తిచేసి విజయవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 25వ తేదీ నాటికి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పనులన్నింటినీ పూర్తి చేసి.. సాంకేతిక మెటీరియల్ అన్నింటినీ ఒకసారి రీచెక్ చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో.. డీపీవో రాజ్యలక్ష్మి, జెడ్పి సీఈవో ఓబులమ్మ, డిఎంహెచ్ఓ డా.నాగరాజు, పోలీసు, ఫైర్ ఆఫీసర్ ధర్మా రావ్, విద్యుత్, ఆర్ అండ్ బి, పీఆర్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో సైనికులకు సంఘీభావంగా విజయోత్సవ తిరంగా ర్యాలీ



**పెళ్లకూరు,పెన్ పవర్ ప్రతినిధి, మే 19 :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం. ఈ తిరంగా ర్యాలీ కార్యక్రమంలో టిడిపి ,బిజెపి, జనసేన, పార్టీ కార్యకర్తలు మరియు మండల అధికారులు, ఎంపీడీవో, ఎమ్మార్వో మరియు ఎంఈఓ, ఆర్ డబ్ల్యు, ఎస్ ఏ ఈ, అర్సేస్, ఏబీవీపీ, విశ్వహిందూ పరిషత్, అభిమానులు మరియు సోదరులు అందరూ కలిసి తిరంగా ర్యాలీలో కోలాహలంగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కలిచేటి నరసింహులు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూరిలో అసువులు బాసిన వీర సైనికులకు సంతాపం తెలియజేశారు. మద్దతుగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. సోమవారం19.05.2025 నాడు ఉదయం8:30 నిమిషాలకు పెళ్లకూరు మండల ఆఫీస్ దగ్గర నుంచి ఎన్ హెచ్ 71 హైవే వరకు ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా మన భారతీయ సైనికులకు సంఘీభావం తెలియజేయుటకు, భారతీయ జనతా పార్టీ , టిడిపి మరియు జనసేన నాయకులు అందరూ కలిసి తిరంగా ర్యాలీని కోలాహాలంగా జయప్రదం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ మండలాధ్యక్షుడు గోగుతట్టు మురళి, భరత్ దేవ కుమార్, రాజారెడ్డి, శ్రీనివాస్ మొదలైన వారు పాల్గొన్నారు.

## మంత్రి సత్యకుమార్ యాదవ్ విజన్‌కు కేంద్ర మద్దతు



**ధర్మవరం పెన్ పవర్ మే 19 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గారు ధర్మవరం నియోజకవర్గం అభివృద్ధికి తీసుకుంటున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. ఇటీవల ఆయన కేంద్ర జౌళి శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ గారికి రాసిన లేఖకు తగిన స్పందన లభించింది. సత్య కుమార్ యాదవ్ గారు 30 ఏప్రిల్ 2025న కేంద్ర మంత్రికి లేఖ రాసి, ధర్మవరం లో ముడి పదార్థాల డిపో ఏర్పాటు కోసం Infrastructure and Technology Support Scheme for Handicraft Sector కింద ఆమోదం కోరారు. దీనికి స్పందనగా, కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ గారు 13 మే 2025న అధికారికంగా ఉత్తరం రాసి, ఆ లేఖను సంబంధిత విభాగానికి అవసరమైన చర్యలు తీసుకునే విధంగా ఫార్వార్డ్ చేసినట్లు తెలిపారు. ఈ చర్య ద్వారా ధర్మవరం హస్తకళల రంగానికి విశేషంగా మేలు జరగనుంది. ఈ ప్రాజెక్ట్ అమలవితే, వేలాది మంది కళాకారులకు నాణ్యమైన ముడి పదార్థాలు తక్కువ ధరకు, సమయానికి అందుబాటులోకి వచ్చి వారి జీవనోపాధికి స్థిరత కలగనుంది. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందిస్తూ, ధర్మవరం కళాకారుల సమస్యలను పరిష్కరించే దిశగా కేంద్రంతో పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నాం. ఇది వోకల్ ఫర్ లోకల్ దిశగా ఒక గొప్ప అడుగు అని తెలిపారు.

## పలుమార్లు అందే పిజిఆర్ఎస్ పిటిషన్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం, పెన్ పవర్ మే 19 :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలుమార్లు అందే పిటిషన్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్ అధికారులు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) సిబ్బంది, కలెక్టరేట్లో అర్జీలు రాసేవారు, ఆన్లైన్లో అప్లోడ్ చేసే సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలను అందించేందుకు వచ్చే అర్జీదారుల ఆధార్ నెంబర్ ద్వారా గతంలో వారు ఎన్ని సార్లు పిటిషన్లు అందించేందుకు వచ్చారో పరిశీలించాలన్నారు. వారు పలుమార్లు పిటిషన్లు అందించి ఉంటే ఆ వివరాలను ఎండార్స్మెంట్ తో సహా ప్రింట్ అవుట్ తీసి అర్జీలు రాసే వారి వద్దకు పంపించాలన్నారు. వారు రాసిన అర్జీతోపాటు ఆ వివరాలను కూడా జతచేసి అధికారుల వద్దకు పంపినప్పుడు గతంలో ఇచ్చిన అర్జీలు ఎందుకు పరిష్కారం కాలేదో పరిశీలించేందుకు వీలుంటుందన్నారు ఈ ప్రక్రియను తప్పనిసరిగా సంబంధిత సిబ్బంది పాటించాలన్నారు. అలాగే వారు ఇచ్చిన పిటిషన్ కు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే మెసేజ్ వెళుతుందని,దాంతో పాటుగా అక్నాలెడ్జ్మెంట్ ను వాట్సప్ ద్వారా వారి ఫోనుకు పంపించాలన్నారు. పిజిఆర్ఎస్ అర్జీ రాసేటప్పుడు గతంలో పిటిషన్ ఇచ్చారా, దాని రసీదును తీసుకురావాలని, పాత పిటిషన్ల అక్నాలెడ్జిమెంట్ కావాలని అడగాలన్నారు. ఇంతకుముందు ఇచ్చిన అర్జీకి సంబంధించిన రసీదు ముఖ్యమని అర్జీదారులకు తెలపాలని, రసీదు తీసుకువచ్చి చూపిస్తే వారి సమస్యను పరిష్కరించేందుకు వీలుంటుందని వారికి తెలియజేయాలన్నారు. రానున్న సోమవారం తాను అర్జీలు రాసే సిబ్బంది వద్దకు వచ్చి వారు ఏవిధంగా అర్జీదారులతో వ్యవహరిస్తున్నారో నేరుగా పరిశీలించడం జరుగుతుందన్నారు. నగరపాలక సంస్థకు సంబంధించి ఫిర్యాదులు ఎక్కువగా అందుతోందని, వాటిని సకాలంలో పరిష్కరించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ఉదయం 6 గంటల నుండి నగరంలో పారిశుద్ధ్యపనులు ప్రారంభించాలన్నారు. కొందరు కార్మికులు సంబంధిత సెక్రటరీల ఆదేశాలను లెక్క చేయటం లేదని అలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నగరంలోని కెనాల్స్ డీసెల్టింగ్ చేపట్టాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో ముందుగానే చేయించాలన్నారు. వర్షం పడినప్పుడు వర్షం నీరు ఎక్కడ ఎక్కువ నిలబడుతుందో చూసి అందుకు గల కారణాలను పరిశీలించి అవి నీరు నిలవకుండా తగు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి జిల్లా యంత్రాంగం జారీ చేసే అలెర్ట్స్ ను ప్రతి అధికారికి వెళ్లాలని, అది వారి గ్రూపుల్లో వాటిని షేర్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మాలోల,డిటిసి వీర్రాజు, పిజిఆర్ఎస్ తహసీల్దార్ వాణిశ్రీ, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, మున్సిపల్ కమిషనర్ బాలస్వామి వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, కమాండ్ కంట్రోల్ రూమ్, పిజిఆర్ఎస్ మరియు డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు, సేవల ప్రజాస్పందనలపై మరింత దృష్టి సారిస్తాం





**కడప జిల్లా, పెన్ పవర్ మే 19 :** ప్రభుత్వ పథకాలు,సేవల ప్రజాస్పందనలపై మరింత దృష్టి సారిస్తామని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుండి.. స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్,యోగాంధ్ర -2025 క్యాంపెయిన్, ప్రభుత్వ పథకాలు, సేవలపై ప్రజా స్పందనలు,జిల్లా సబ్ ఆర్డినేట్ కోర్టులలో టాయిలెట్స్ కాంప్లెక్స్ వంటి వివిధ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి తగు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి.. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి తోపాటు.. జేసీ అదితిసింగ్,డి ఆర్ వో విశ్వేశ్వర నాయుడు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ మాట్లాడుతూ... స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ కింద అమలు చేస్తున్న ప్రాజెక్ట్స్ లలో ఆయా జిల్లాలకు సంబంధించిన సమస్యలను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టులకు సంబంధించి ప్రతి 15 రోజులకు ఒకసారి రివ్యూ చేయడం జరుగుతుందన్నారు..ఆయా జిల్లాలకు సంబంధించి ప్రాజెక్టు పనులలో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వచ్చే నెల జూన్ 21వ తేదీన జరగబోయే యోగాంధ్ర 2025 క్యాంపెయిన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లు యోగ ప్రోటోకాల్స్ పాటించి విజయవంతం చేయాలన్నారు.దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ,రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైజాగ్ లో జరిగే యోగా దినోత్సవంలో పాల్గొంటారని తెలిపారు.

జిల్లా, మండల్, విలేజ్ స్థాయిలో యోగ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.యోగా ప్రమోషన్ అండ్ అవేర్నెస్ యాక్టివిటిస్ లో భాగంగా ఈ నెల 21 మే అన్ని జిల్లాల్లో కర్టెన్ రైజన్ కార్యక్రమం నిర్వహించి జిల్లాల్లో ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ యోగా పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి మండలం లో యోగా రిజిస్ట్రేషన్స్, మాస్టర్ ట్రైనర్లను, అనువైన ప్రాంతాలను గుర్తించించాలన్నారు. మండల స్థాయిలో యోగ పై ర్యాలీలు,రంగోలి, కాంపిటీషన్స్ నిర్వహించాలన్నారు.

జిల్లా కలెక్టర్ లు యోగాంధ్ర పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా సబార్డినేట్ కోర్టులలో దెబ్బతిన్న మరియు కొత్త టాయిలెట్స్ కాంప్లెక్సలను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు సేవలపై వచ్చే ప్రజా స్పందనలపై తేలికగా తీసుకోకుండా జిల్లా కలెక్టర్లు సమీక్ష చేసి నిరంతరం మానిటరింగ్ చేయాలన్నారు. సీఎస్ విసిలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పెద్దముడియం మండల సోలార్ ప్రాజెక్టుకు సంబంధించి రెవెన్యూ భూముల సమస్యలను పరిష్కరిస్తామని సీఎస్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీవో హాజరతయ్య, ఆర్ అండ్ బి ఎస్ ఈ చంద్ర శేఖర్,జిల్లా పర్యాటక అధికారి సురేష్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికులకు ప్రభుత్వ ఏర్పాట్లు



**అమరావతి పెన్ పవర్ మే 19 :** ఆంధ్రప్రదేశ్ నుండి హజ్ యాత్ర -2025 కు బయలుదేరే యాత్రికులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా, అత్యంత పగడ్బందీగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లను పూర్తి చేసి పర్యవేక్షిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. హైదరాబాద్ ఎంబార్కేషన్ సెంటర్ నుంచి రెండవ విడతలో 906 మంది ఏపీ ప్రయాణికులు సోమ, మంగళవారాల్లో మూడు విమానాలలో హజ్ యాత్రకు జెడ్డాకు వెళ్తున్నారు. హైదరాబాదులోని లకడికపూల్ సెంటర్లో ఉన్న షా ఫంక్షన్ ప్లాజాలో ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమాన్ని మైనారిటీ మంత్రిత్వ శాఖ, హజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రెండవ విడత యాత్రకు బయలుదేరి వెళ్లే యాత్రికులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్, మైనారిటీ మంత్రిత్వ శాఖ సలహాదారుడు ఎంఏ షరీఫ్, హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష,హజ్ కమిటీ సభ్యులు, తదితరులు జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రస్తుత ఏడాది పవిత్ర హజ్ యాత్రకు మొత్తం 1630 మంది యాత్రికులు వెళ్లడం జరుగుతున్నదని అన్నారు. ఇందులో 1170 మంది హైదరాబాద్ ఎంబార్కెషన్ కేంద్రం నుంచి, 451 మంది బెంగళూరు ఎంబార్కెషన్ కేంద్రం నుంచి, మిగిలిన 9 మంది ఇతర ఎంబార్కెషన్ కేంద్రాల నుంచి బయలుదేరడం జరుగుతున్నదని వెల్లడించారు.ఈనెల 19,20 వ తేదీలు సోమ,మంగళ వారాలలో మూడు విమానాల్లో మొత్తం 818 మంది హజ్ యాత్రికులు హైదరాబాద్ ఎంబార్కెషన్ కేంద్రం నుండి హజ్ కు వెళ్తున్నట్లు తెలిపారు.మరో 88 మంది యాత్రికులు ఈనెల 27 వ తేదీ చివరి విమానంలో హజ్ యాత్రకు వెళ్తున్నట్లు తెలిపారు. విజయవాడ ఎంబార్కెషన్ నుంచి కేవలం 72 మంది యాత్రికులు మాత్రమే తమ ఆప్షన్ ఇవ్వడం కారణంగా, సాంకేతిక కారణాల వలన, భారత విమానయాన శాఖ ద్వారా స్పెషల్ చార్టర్ ఫ్లైట్ వసతి కల్పించలేని పరిస్థితులలో, హజ్ కమిటీ ఆఫ్ ఇండియా, ముంబై ఆ 72 మంది యాత్రికులను హైదరాబాద్ ఎంబార్కెషన్ నుండి బయలుదేరుటకు అనుమతించడం జరిగిందని పేర్కొన్నారు. గత నెలలో మొదటి విడతలో హజ్ యాత్రకు ఏపీ నుంచి 724 మంది యాత్రికులు హైదరాబాద్, బెంగళూరు ఎంబార్కెషన్ కేంద్రాల నుండి పవిత్ర మక్కా, మదీనా పుణ్య క్షేత్రాలకు వెళ్లడం జరిగిందని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సురక్షితంగా, క్షేమంగా వారంతా చేరడం జరిగిందని మిగిలిన యాత్రికులకు కూడా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఏపీ హజ్ యాత్రికులకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా ఏలాంటి లోటు పాట్లు లేకుండా పగడ్బందీగా ఏర్పాట్లు చేయడం జరిగిందని మంత్రి ఫరూక్ వెల్లడించారు. హజ్ యాత్రకు వెళ్లే వారికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, వ్యాక్సినేషన్ క్యాంపులు నిర్వహించడమైనదని, కర్ణాటక,తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులు, ఆయా రాష్ట్రాల హజ్ కమిటీల తో, ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశాలు కూడా నిర్వహించి ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించామని తెలిపారు. పూర్తి సహకారాన్ని అందిస్తున్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలకు మంత్రి ఫరూక్ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అవసర, ఆవశ్యకతలను బట్టి ఏర్పాట్ల ప్రక్రియ పూర్తి చేసి పర్యవేక్షిస్తున్నట్టు వెల్లడించారు. మన రాష్ట్రం నుండే నేరుగా హజ్ కి వెళ్ళేందుకు ఏర్పాట్లు ఉంటే మరింత సౌలభ్యంగా ఉంటుందని ఒక యాత్రికురాలు కోరగా, విజయవాడ ఎంబార్కేషన్ కోరే ప్రతి హజ్ యాత్రికుడికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తామని మంత్రి తెలిపారు. మైనారిటీ మంత్రిత్వ శాఖ ప్రభుత్వ సలహాదారుడు ఏంఏ షరీఫ్ మాట్లాడుతూ హజ్ యాత్రికులను సాగనంపే ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. హజ్ యాత్ర ఆధ్యాత్మిక ప్రయాణం మాత్రమే కాదని,సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వాన్ని పెంపొందించే ముఖ్య సందేశమని పేర్కొన్నారు. హజ్ యాత్ర విజయవంతంగా సాగేలా రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారులు, సిబ్బంది సహకారం అందిస్తారని, అందరూ అవసరమైన సహాయాన్ని పొంది యాత్రను దిగ్విజయంగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ ఈవో గౌస్ పీర్, రెండు తెలుగు రాష్ట్రాల మైనార్టీ మంత్రిత్వ శాఖలు, హజ్ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి నూతన ప్రెస్ క్లబ్ కమిటీకి ఎమ్మెల్యే బొజ్జల అభినందనలు



**శ్రీకాళహస్తి/పెన్ పవర్/మే 19 :** శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ నూతన కార్యావర్గాన్ని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తన స్వగృహానికి పిలిపించి ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాస్వామ్యబద్దంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు తన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రత విషయంలో రాజీ పడనని హామీ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ముత్యాల వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి కందెరి కార్తీక్ నాయుడు, గౌరవాధ్యక్షులు వై. చంద్రయ్య, పిఆర్ఓ ఈశ్వర్ పరిటాలను ఎమ్మెల్యే ఆత్మీయంగా అభినందించి శుభా కాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యేను నూతన కార్యవర్గం శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ సీనియర్ పాత్రికేయులు, సహచర పత్రికలు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం బోల్తా



**సోమల/పెన్ పవర్/మే 19 :** ఇరికిపెంట చెరువు మలుపు వద్ద సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో అదుపుతప్పి ద్విచక్ర వాహనం బోల్తాపడటంతో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న సుమారు 20 సంవత్సరాల వయస్సు గల చౌడేపల్లి కి చెందిన సందీప్ తీవ్రంగా గాయపడ్డాడు.. వెంటనే స్థానికులు 108 కి సమాచారం అందించి గాయపడిన వ్యక్తిని పుంగనూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి చౌడేపల్లి చెందిన సందీప్ అని, మృతి చెందాడని కొంతమంది స్థానికులు తెలిపారు. ఘటనపై పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి



**ధర్మవరం పెన్ పవర్ మే 19 :** స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక సిపిఎం పార్టీ నాయకులు మాట్లాడుతూ “ 1913 మే 1వ తేదీన అలాగానిపాడు. నెల్లూరు జిల్లా (ఆంధ్ర ప్రదేశ్) లో జన్మించిన పుచ్చలపల్లి సుందరయ్య’ రాష్ట్రంలో అత్యంత ఆదర్శవంతమైన నాయకుల్లో అగ్రగామి పుచ్చలపల్లి సుందరయ్య. రాజకీయ విభేదాలతో నిమిత్తం లేకుండా ఆయనను అభిమానించేవారు రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమంలోను. వెలుపల కోకొల్లలుగా ఉన్నారు. జాతీయ స్థాయిలో సైతం యవ్వనంలోనే ఉన్నత విలువలు పాటించి. నెహ్రూ లాంటి వారి అభిమానాన్ని సైతం చురగొన్న వ్యక్తి తనతో రాజకీయంగా విభేదించే వారిని సైతం ఆయన గౌరవించేవారు.

**నిబద్ధత కలిగిన అసాధారణ వ్యక్తిత్వం :** 200 సంవత్సరాల బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా సాగిన. పోరాటా ఫలితంగా మనం స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నాం. ఆ పోరాట విలువల్లో నుంచి సుందరయ్య లాంటి మహనీయులు రాజకీయాల్లో అడుగు పెట్టారు సమాజం కోసం త్యాగం చేయటం. ప్రజల పట్ల నమ్రత. నమ్మకం. పోరాటాల పట్ల నిబద్ధత. మార్క్సిస్టు సిద్ధాంతం పట్ల అంచెంచల విశ్వాసం ఆయన వ్యక్తిత్వాన్ని రూపుదిద్దాయి. ఈరోజు ఆయన మనముందు సజీవంగా లేకపోయినా వారు నిర్మించిన ఉద్యమం. చూపించిన బాట. నెలకొల్పిన విలువలు సజీవంగా ఉన్నాయి. ఆ బాటలో కమ్యూనిస్టు ఉద్యమం పురోగమించడానికి సరికొత్త నేపథ్యం ఏర్పడుతోంది. రాష్ట్రంలో బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని పునర్నిర్మించడమే సుందరయ్యకు మనం అర్పించగలిగే నివాళి. విజన్ 2020. 2047ల గురించి మాట్లాడే నాయకులు 1946లోనే ‘విశాలాంధ్ర దినపత్రికలో ప్రజారాజ్యం’ పేరుతో సుందరయ్య రాసిన ప్రణాళికను చదివితే కమ్యూనిస్టుల దీర్ఘ దృష్టి. విజన్ అర్థం అవుతుంది. కార్పొరేట్ విజన్లకు భిన్నమైన శ్రామిక వర్గాల విజన్ అది అది మాత్రమే అసమానతలు లేని సమాజాన్ని నిర్మించ గలుగుతుంది. ఈ కార్యక్రమంలో జంగాలపల్లి పెద్దన్న, బాషా, మారుతి, రమణ, అయూబ్ ఖాన్, ఆదినారాయణ, వెంకటస్వామి, నారాయణస్వామి నాగవేణి పాల్గొన్నారు.

### ఘనంగా కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి వేడుకలు

**కావలి పెన్ పవర్, మే19 :** కావలి పట్టణంలోని కసాయి వీధిలో ఉన్న శివరామ సుబ్బయ్య భవనంలో అమర జీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టి.సుబ్బారామ శర్మ, ఆకుల రమణయ్య పూలమాలను వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం పసుపులేటి పెంచలయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య లేకపోవడం వామపక్ష ఉద్యమానికి లోటని దక్షిణ భారత మార్క్సిస్టు పార్టీ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రజలు కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు అలు పెరగని పోరాటాలు నడిపారని పార్లమెంటు సభ్యులుగా ఉండి పార్లమెంటులో ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజా కార్మిక సమస్యల పై గలమెత్తే వాడని అన్నారు. దేశ ప్రయోజనాల కొరకు ఎంతో కృషి చేశారని ఆయన మరణించి 40 సంవత్సరాలు అయినప్పటికీ మరుపరాని నాయకుడని సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని ఆయన ఇచ్చిన మార్క్సిస్టు పార్టీ జెండాను పట్టుకొని ఆయన ఆశయాలను సాధించేందుకు కార్యకర్తలు పోరాటాలు కొనసాగించాలని ప్రజా కార్మిక సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం పోరాటాలను కొనసాగించాలని సూచించారు. ప్రస్తుతం ప్రమాదకరమైన విధానాలతో కేంద్రంలో పరిపాలిస్తున్న బిజెపి ప్రభుత్వానికి ప్రజా పోరాటాల ద్వారానే బుద్ధి చెప్పాలని రాబోవు రోజులలో పెట్టుబడిదారులకు పెట్టుబడిదారీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజలను ఐక్యం చేసి పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.వెంకయ్య, టి.సుబ్బరామ శర్మ పాల్గొన్నారు.

# ఏపీకి ఆ ఆరు కుంకీ ఏనుగులు

**తిరుపతి, మే 19, పెన్ పవర్:** కర్ణాటక ప్రభుత్వం ఏపీకి ఆరు కుంకీ ఏనుగులు ఇచ్చేందుకు అంగీకరించింది. మే 21న ఈ ఏనుగులను అందించనుంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవ, ఏడాది కాలంగా వివిధ మార్గాల్లో జరిగిన చర్చలు ఎట్టకేలకు ఫలించాయి. ఏపీకి 6 కుంకీ ఏనుగులు ఇచ్చేందుకు కర్ణాటక అంగీకరించిందికర్ణాటక కుంకీ ఏనుగులకు భారతదేశంలోని అనేక రాష్ట్రాలలో అధిక డిమాండ్ ఉంది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కేరళ, ఉత్తరాఖండ్ సహా అనేక రాష్ట్రాలకు కర్ణాటక కుంకీ ఏనుగులను పంపిస్తుంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో కూడా ఈ ఏనుగులకు ఎక్కువ డిమాండ్ ఉంది. ఏడాది నుండి జరిగిన చర్చల తర్వాత ఇప్పుడు ఏపీకి ఆరు కుంకీ ఏనుగులు ఇచ్చేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకారం తెలిపింది.ఆంధ్రప్రదేశ్‌కు మే 21న 6 కుంకీ ఏనుగులను పంపించనున్నారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డి.కె.శివవ్ తో ఏపీ డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఈ విషయంపై చర్చించారు. వీరి చర్చల ఫలితంగా ఆరు ఏనుగులు ఇచ్చేందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించింది.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 8 కుంకీ ఏనుగులు ఇవ్వాలని కర్ణాటక ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై స్థానికంగా

వ్యతిరేకత రావడంతో ఆరు ఏనుగులు మాత్రమే ఇచ్చేందుకు కర్ణాటక అటవీ శాఖ అంగీకరించిందిదుబరే (కొడగు శిబిరం) నుంచి మాస్తి, దేవ, రంజన్, సక్రెబైల్ (షిమోగా క్యాంపు) నుంచి కరుణా, కృష్ణ, అభిమన్యు కుంకీ ఏనుగులను ఏపీకి ఇచ్చేందుకు కర్ణాటక అంగీకరించింది. కర్ణాటక దసరా మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. ఈ మహోత్సవం కోసం వినియోగించే ఏ కుంకీ ఏనుగులను ఏపీకి ఇవ్వడంలేదని కర్ణాటక ప్రభుత్వం తెలిపింది.కర్ణాటక అటవీ, పర్యావరణ మంత్రి ఈశ్వర బి ఖండ్రే ఈ విషయంపై ప్రకటన జారీ చేశారు. పొరుగు రాష్ట్రాలతో సఖ్యత, సంబంధాలు పెంచుకోవడంతో పాటు, కర్ణాటక-ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ప్రజల రక్షణలో

భాగంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు.గత ఆగస్టులో బెంగళూరులో జరిగిన ఏనుగులు-మానవ సంఘర్షణ అంతర్జాతీయ సదస్సులో కర్ణాటక- ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అలాగే కేరళ రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా ఏనుగులు ఆయా

రాష్ట్రాలకు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారుగత ఏడాది ఆగస్టు 8న పవన్ కల్యాణ్ బెంగళూరులో పర్యటించారు. ఏపీలోని పలు జిల్లాల్లో ఏనుగుల బెడదను తగ్గించడానికి కుంకీ ఏనుగులను అందించాలని, అటవీ శాఖ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 27న కర్ణాటక బృందం ఏపీలోని విజయవాడలో పర్యటించి ఒప్పందం చేసుకున్నారు. మే 21న ఆరు కుంకీ ఏనుగులను అందించాలని నిర్ణయించుకున్నారు.

# కుడి, ఎడమ చేతులకు సంకెళ్లేగా?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ చుట్టూ ఉన్న కోటరీని కూటమ ప్రభుత్వం టార్గెట్ చేసినట్లు కనపడుతుంది. జగన్ అధికారంలో ఉండగా చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన వారి ఆర్థిక మూలాలను దెబ్బకొట్టే ప్రయత్నం చేశారు. అయితే చంద్రబాబు రాజకీయ తెలిసిన వ్యక్తి. అందుకే సామాజికవర్గాన్ని టార్గెట్ చేసినట్లు కనిపించకుండా అదే వర్గం వారిని అరెస్ట్ చేయకుండా అన్ని సామాజికవర్గాలను అరెస్ట్ చేస్తూ వారిపై కేసులు నమోదు చేస్తూ మరొకకొత్త విధానానికి కూటమి సర్కార్ శ్రీకారం చుట్టింది. దీంతో పాటు జగన్ కు కుడి, ఎడమ భుజాలుగా ఉన్నవారిని కూడా అదుపులోకి తీసుకుని కేసుల్లో ఇరికించి జైలుకు పంపితే జగన్ ఒంటరి వాడు అవుతాడన్న అంచనాలు కావచ్చు చంద్రబాబు రాజకీయం అలాగే ఉంటుంది. ముందు నందిగం సురేశ్ జైలుకు వెళ్లారు. హత్య కేసులో ఆయన జైలు ఊచలు లెక్కపెట్టి వచ్చారు. తర్వాత పోసాని కృష్ణమురళిపై కేసు మీద కేసులు పెడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఒక రౌండ్ వేశారు. జైల్లో కొన్నాళు న్న పోసాని కృష్ణమురళి ఎట్టకేలకు బెయిల్ తో బతుకు జీవుడా అని బయటపడ్డారు. ఇక వల్లభనేని వంశీ మూడు నెలల నుంచి విజయవాడ జిల్లా జైలులోనే ఉన్నారు. వంశీపై వరస కేసులు నమోదవుతున్నాయి. అంటే చంద్రబాబు ఒకే సామాజికవర్గాన్ని టార్గెట్ చేశారన్న ముద్ర మాత్రం వేసుకోలేదు. ఇప్పుడు జగన్ కోటరీలో ఒక్కొక్కరు నేరుగా జైలులోకి వెళుతున్నారు. ఇక ఇంకా అనేక మంది లైన్ లో ఉన్నారని చెబుతున్నారు గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో టీడీపీని ఇబ్బందిపాలు చేసింది జగన్ తో పాటు కోటరీ కూడా ప్రధాన కారణమని చంద్రబాబు గట్టిగా నమ్ముతున్నారు. ఏపీ మద్యం స్కామ్ కేసులో ఇప్పటికే అరెస్టయిన ఏడుగురిలో దాదాపు నలుగురు జగన్ కోటరీలో ఉన్నవారే. మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, జగన్ కు ఓఎస్డీగా వ్యవహరించిన కృష్ణమోహన్ రెడ్డిలు కూడా జగన్ కు నాడు రైట్ హ్యాండ్ గా వ్యవహరించారు. వీరిద్దరి అనుమతి లేనిదే జగన్ క్యాంప్ కార్యాలయంలోకి మంత్రులు కూడా కాలుమోపలేని పరిస్థితి నాడు. వీరే రాజకీయ నిర్ణయాలు కూడా తీసుకుంటున్నారు. అభ్యర్థుల ఎంపికతో పాటు అభివృద్ధి పనుల మంజూరులోనూ వీరే కీలకంగా మారారు. ఇప్పుడు కూడా వీరిద్దరూ జగన్ కు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఇక వీరితో పాటు లైన్ లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం కూడా ఉంది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులపై ఇప్పటికే అటవీ భూముల ఆక్రమణ కేసు నమోదయింది. రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి కూడా మద్యం స్కామ్ కేసులో నిందితుడిగా ఉన్నారు. వీరితో పాటు నాడు ప్రభుత్వ సలహాదారుగా, సకల శాఖల మంత్రిగా వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డి కూడా క్యూలో ఉన్నారని చెబుతున్నారు. చిట్ట చివరకు జగన్ ను టార్గెట్ చేయనున్నారు. ఇలా జగన్ చుట్టూ ఉన్న కోటరీని ఇబ్బందులు పాలు చేసి వారిపై కేసులు పెట్టి జైలుకు పంపగలిగితే మాత్రం జగన్ ను ఒకరకంగా దెబ్బకొట్టినట్లవుతుందన్న భావనలోనే ఈ ప్రభుత్వం ఉన్నట్లు జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే అర్థమవుతుంది.

# కమ్మ నేతలు కామ్...

**విజయవాడ, మే 19, పెన్ పవర్:** వైసీపీ లో కమ్మ సామాజికవర్గానికి చెందిన నేతలు కామ్ అయిపోయారు. గత ఏడాది కాలం నుంచి వారు వైసీపీలో ఉన్నారా? లేదా? అన్న సంశయం ప్రతి ఒక్కరిలోనూ కలుగుతుంది. 2019 ఎన్నికల్లో పెదకూరపాడు నియోజకవర్గం నుంచి నంబూరి శంకరరావు, వినుకొండ నియోజకవర్గం నుంచి బొల్లా బ్రహ్మనాయుడులు ఎన్నికయ్యారు. అలాగే తెనాలి నియోజకవర్గం నుంచి అన్నాబత్తుని శివకుమార్ కూడా వైసీపీ నుంచి 2019 ఎన్నికల్లో గెలిచారు. ఇక దెందలూరు నుంచి అబ్బయ్య చౌదరి, గుడివాడ నుంచి కొడాలి నాని, గన్నవరం నుంచి వల్లభనేని వంశీలు ఎన్నికయ్యారు. గత వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కమ్మ సామాజికవర్గం నుంచి కొడాలి నానికి మాత్రమే కేబినెట్ లో చోటు దక్కింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత వైసీపీలో ఉన్న కమ్మ సామాజికవర్గం నేతలందరూ మౌనంగానే ఉన్నారు. పల్నాడు జిల్లాలో ఉన్న మర్రి రాజశేఖర్ కూడా ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఇక నంబూరి శంకరరావు, బొల్లా బ్రహ్మనాయుడు, అన్నాబత్తుని శివకుమార్ ల అడ్రస్ కూడా దొరకడం లేదు. మైలవరం నుంచి గెలిచిన వసంత కృష్ణ ప్రసాద్ పార్టీ మారి వెళ్లిపోయారు. మిగిలిన వారు పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగానే ఉంటున్నారు. గుంటూరు కార్పొరేషన్ లో వైసీపీ బలం ఉన్నప్పటికీ టీడీపీ మేయర్ పదవిని సొంతం చేసుకుంటున్నా మాజీ ఎమ్మెల్యేలుగా వీరు చేసిన ప్రయత్నాలు శూన్యమనే చెప్పాలి. కనీసం పార్టీ పిలుపు ఇచ్చిన కార్యక్రమాలకు కూడా కమ్మ సామాజికవర్గం నేతలు దూరంగా ఉంటున్నారు. దెందులూరు నియోజకవర్గంలోనూ అబ్బయ్య చౌదరి పెద్దగా యాక్టివ్ గా లేరు. అక్కడ చింతమనేని దెబ్బకు బయటకు కూడా రావడం మానుకున్నారు. ఒకరకంగా వీరిని కమ్మ సామాజికవర్గం ప్రజలు వెలివేసినట్లే కనపడుతుంది. వారు నియోజకవర్గంలో తిరగడానికి కూడా ఇష్టడటం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వరసగా పోసాని కృష్ణమురళి, వల్లభనేని వంశీలను అరెస్ట్ చేయడంతో కొంత కమ్మ సామాజికవర్గం నేతలు డైలమాలో పడినట్లే కనిపిస్తుంది. కూటమి ప్రభుత్వం అమరావతికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుండటం, తమ వైసీపీ ప్రభుత్వం రాజధానిని పట్టించుకోకపోవడంతో ఆ ఎఫెక్ట్ సొంత సామాజికవర్గం నుంచి పడుతుందని వారు అంచనా వేస్తున్నారు. అందుకే దూరంగా ఉండాలని, నాలుగేళ్లకు ముందే బయటకు వచ్చినా ప్రయోజనం లేదని భావించిన నేతలు తర్వాత చూద్దాంలే అన్న ధోరణిలో ఉన్నట్లనిపిస్తుంది. వచ్చే ఎన్నికల్లో తాము పోటీ చేసినా వైసీపీ నుంచి గెలవడం కష్టమేనని భావించి కొందరు రాజకీయాలకు కూడా గుడ్ బై చెప్పనున్నారు.

# మద్యం స్కామ్ అరెస్ట్ లు ఎవరు...

**నెల్లూరు, మే 19 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో మద్యం స్కామ్ కేసు విచారణ వేగం అందుకుంది. ఇప్పటికే ఈ కేసులో ఏడుగురు అరెస్ట్ అయ్యారు. కీలక నిందితులందరినీ అరెస్ట్ చేశారు. 2019 -2024 మధ్య కాలంలో ఆంధ్రప్రదేశ్ లో మద్యం దుకాణాల నిర్వహణ, డిస్టలరీ నుంచి కొనుగోలు విషయంలో పెద్దయెత్తున అవినీతి జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వమే లిక్కర్ దుకాణాలను నిర్వహించడంతో పాటు డిజిటల్ పేమెంట్ కు అంగీకరించకపవడంపై కూడా పలు అనుమానాలు తలెత్తాయి. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్యం స్కామ్ పై స్పెషల్ ఇన్విస్టిగేషన్ టీం ను ఏర్పాటు చేసింది. దాదాపు పది వేల కోట్ల రూపాయల మేరకు కుంభకోణం జరిగిందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఈడీ కూడా ఎంటర్ కావడంతో... దీంతో ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ అధికారులు కూడా దీనిపై విచారణకు సిద్ధమయ్యారు. మనీలాండరింగ్ జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో ఈడీ అధికారులు కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకూ నాటి ముఖ్యమంత్రి జగన్ కు దగ్గరగా ఉండి, కోటరీలో ప్రధానంగా ఉన్నవారిని కూటమి ప్రభుత్వం తొలుత టార్గెట్ చేసిందన్న ప్రచారం ఊపందుకుంది. విజయసాయిరెడ్డి వైసీపీకి రాజీనామా చేసిన అనంతరం ఆయన ఇచ్చిన ఆధారాల మేరకు రాజ్ కసిరెడ్డిని అరెస్ట్ చేసిన సిట్ అధికారులు తర్వాత వరసగా దిలీప్ ను అరెస్ట్ చేశారు. గోవిందప్ప బాలాజీని మైసూరులో అరెస్ట్ చేసి తీసుకు వచ్చారు. వీరితో పాటు రాజ్ కసిరెడ్డితో సంబంధమున్న మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. తాజాగా మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి, జగన్ ఓఎస్డీగా వ్యవహరించిన కృష్ణమోహన్ రెడ్డిలను కూడా



అరెస్ట్ చేశారు. ఇక ఇదే కేసులో రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి కూడా ఉన్నారు. అయితే సుప్రీంకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకోవడంతో ఆయన అరెస్ట్ ఆగిందంటున్నారు. అయితే మిథున్ రెడ్డిని ఇప్పటికే సిట్ అధికారులు విచారించారు. కానీ కీలకమైన నిందితులు ఇచ్చిన స్టేట్ మెంట్ ఆధారంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ ను అరెస్ట్ చేయడానికి రంగం సిద్ధమయినట్లు సమాచారం. ఈ కేసులో జగన్ ను ఏ క్షణమైనా అదుపులోకి తీసుకుని విచారణ చేసే అవకాశముందని ప్రచారం ఏపీలో జరుగుతుంది. మద్యం స్కామ్ జగన్ మెడకు చుట్టుకుంటుందని తొలి నుంచి అందరూ భావిస్తుంది. నాడు స్కిల్ డెవలెప్ మెంట్ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేసి యాభై మూడు రోజుల పాటు జైల్లో ఉంచిన నేపథ్యంలో ఈ నెలలోనే జగన్ అరెస్ట్ జరిగే అవకాశాలున్నాయంటున్నారు. . ఇప్పటికే గత ఐదేళ్ల పాటు జగన్ తో సన్నిహితంగా ఉన్నవారందరూ ఒక్కొక్కరుగా ఈ కేసులో అరెస్ట్ అవుతున్నారు. వారు కీలకమైన సమాచారం సిట్ అధికారులకు ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే వైసీపీ నేతలు కూడా జగన్ అరెస్ట్ అవుతారని వ్యాఖ్యానిస్తుండటం ఇందుకు అద్దంపడుతుంది. ఎన్నికలకు ముందుగానే అరెస్ట్ చేస్తే సింపతీ అన్నది రాకుండా పోతుందని, చంద్రబాబు నాటి అరెస్ట్ కు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చే పనిలో కూటమి ప్రభుత్వం ఉందని అంటున్నారు. నిన్న మాజీ మంత్రి పేర్ని నేని, నేడు భూమన కరుణాకర్ రెడ్డి కూడా జగన్ ను అరెస్ట్ చేస్తారని చెప్పడం వెనక అదే కారణమంటున్నారు. అయితే జగన్ కూడా మానసికంగా అరెస్ట్ కు సిద్ధమయ్యారని వైసీపీ నేతలే చెబుతుండటం విశేషం

## దేశంలోనే తొలిసారి ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్, ట్రీ ట్రాన్స్‌లొకేషన్

**విజయవాడ మే 19 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక గొప్ప నిర్ణయం తీసుకుంది. రాజధాని నిర్మాణంలో దేశంలోనే ఎక్కడా లేని విధంగా తొలిసారి సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాజధాని అమరావతి నిర్మాణంలో ప్రకృతికి ఎలాంటి హాని చేయకూడదని భావించిన చంద్రబాబు సర్కార్.. చెట్లను తొలగించి.. వాటిని మళ్లీ ఇతర ప్రాంతాల్లో నాటుతోంది. దీనివల్ల ప్రకృతికి ఎలాంటి నష్టం జరగదని భావిస్తోంది. అమరావతిని హరిత నగరంగా మార్చడంలో భాగంగా కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం.. అమరావతే రాజధాని అని తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవాన్ని ఇటీవలె ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా వచ్చి మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే శరవేగంగా రాజధాని నిర్మాణాన్ని చేపట్టేందుకు టీడీపీ-జనసేన-బీజేపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే అమరావతి రాజధానిని హరిత నగరంగా మార్చేందుకు నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి సర్కార్.. వినూత్న ప్రయత్నం చేస్తోంది. దేశంలోనే తొలిసారి ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్, ట్రీ ట్రాన్స్‌లొకేషన్ పద్ధతిని చేపడుతోంది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా అమరావతిని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఈ నేపథ్యంలోనే దేశంలోనే తొలిసారిగా భారీ ఎత్తున ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కార్యక్రమానికి చంద్రబాబు సర్కార్ చర్యలు చేపట్టింది. ఈ ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రక్రియలో భాగంగా రోడ్ల నిర్మాణాలకు అడ్డుగా ఉన్న వందలాది చెట్లను ఉన్న ప్రాంతం నుంచి తీసి.. సురక్షితంగా మరో చోటుకు తరలించి అక్కడ మళ్లీ నాటుతోంది. దీని వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని ఉండదని భావిస్తోంది.సాధారణంగా రోడ్ల విస్తరణ లేదా మరేదైనా అభివృద్ధి పనులు చేస్తున్నారంటే.. ఆ ప్రాంతంలో ఉన్న చెట్లను నరికివేస్తూ ఉంటారు. అయితే ఇలా భారీ ఎత్తున చేపట్టే అభివృద్ధి పనుల్లో చెట్లను నరికేయడం ద్వారా.. పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఈ క్రమంలోనే పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చేందుకు.. చెట్లను నరికివేయకుండా ట్రీ ట్రాన్స్‌లొకేషన్ పద్ధతి ద్వారా వాటిని సురక్షితంగా తరలించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియలో భాగంగానే చెట్ల కొమ్మలను కత్తిరించి.. చెట్టు మొదట్లో చుట్టూ తవ్వి కొంతమేర వేళ్లను కత్తిరిస్తారు. ఆ తర్వాత వేరు వ్యవస్థ కుళ్లిపోకుండా దానికి ఫంగల్ ట్రీట్‌మెంట్ కూడా ఇస్తారు. వేరు చుట్టూ ఉన్న మట్టితో సహా చెట్టును క్రేన్ సహాయంతో పైకి లేపి.. చుట్టూ గోనె సంచిని చుడతారు.ఆ తర్వాత.. అక్కడ తీసిన చెట్లను తుళ్లూరు మండలం అనంవరంలోని ట్రీ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్‌కు తరలిస్తారు. ఆ సెంటర్‌లో పెద్ద ప్లాస్టిక్ సంచుల్లో కోకోపిట్, ఎర్రమట్టి, ఎరువులు కలిపిన మిశ్రమాన్ని నింపి, డ్రిప్ ద్వారా నీటి తడులను ఆ చెట్లకు అందిస్తారు. సాధారణంగా ఈ పద్ధతిలో చెట్లు బతికే అవకాశం 40 శాతం మాత్రమే ఉంటుంది. అయితే ప్రత్యేక చర్యలు చేపట్టడం ద్వారా 85 శాతం వరకు చెట్లను కాపాడే అవకాశాలు ఉంటాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఇలా కొన్నిరోజులు సంరక్షించబడిన వేలాది చెట్లను అమరావతిలోని గ్రీన్ జోన్లలో నాటేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా అమరావతిని పచ్చని నగరంగా తీర్చిదిద్దడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నట్లు ప్రభుత్వం చాటి చెప్పనుందని పేర్కొన్నారు.

## అమెరికాకు మాజీ మంత్రి...

**హైదరాబాద్, మే 19 పెన్ పవర్:** గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న మాజీ మంత్రి కొడాలి నాని.. గత నెలలో బైపాస్ సర్జరీ చేయించుకున్నారు. అయితే, ఆయన మెరుగైన చికిత్స కోసం అమెరికా వెళ్లనున్నారు. గత నెలలో ముంబైలో ఆయనకు గుండె శస్త్రచికిత్స జరిగింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన వైద్యుల సలహా మేరకు అమెరికాలో చికిత్స పొందనున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పార్టీ వర్గాలు తెలిపాయి. త్వరలోనే ఆయన అమెరికాకు బయలుదేరనున్నారు.గుండె సంబంధితన సమస్యతో బాధపడుతోన్న మాజీ మంత్రి, వైఎస్ఆర్సీపీ ముఖ్య నేత కొడాలి నాని త్వరలో అమెరికా వెళ్లనున్నట్టు తెలుస్తోంది. గత నెల మొదటివారంలో కొడాలి నాని గుండెకు ముంబయిలో శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు. మెరుగైన చికిత్స కోసం వైద్యుల సలహా మేరకు అమెరికా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. కానీ, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని పార్టీ నేతలు తెలిపారు.సర్జరీ అనంతరం కొడాలి నాని హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయి.. ముంబయిలోనే నెల రోజుల పాటు ఉన్నారు. నుంచి ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన తరువాత ఆయన పూర్తిగా విశ్రాంతి తీసుకుంటున్నారు. ముఖ్యమైన వాళ్లను మాత్రమే కలుస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ అధినేత జగన్ ఆయనకు ఫోన్ చేసి పరామర్శించారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో ఉన్నారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం అమెరికా వెళ్లడానికి సిద్ధమయ్యారు.మార్చిలో అనారోగ్యానికి గురైన ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చేరారు. కొడాలికి ముందు గ్యాస్టిక్ సమస్య అని చెప్పగా.. ఆ తర్వాత గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతున్నట్టు నిర్ధారించారు. వైద్య పరీక్షల్లో ఆయన గుండెలో మూడు రక్తనాళాలు మూసుకుపోయినట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే బైపాస్ సర్జరీ చేయాలని నిర్ణయించారు. దీంతో ఏప్రిల్ 2న ప్రత్యేక విమానంలో కొడాలి నానిని ముంబైకి తరలించారు.ఏప్రిల్ 4న ముంబయిలోని ఏషియన్ హార్ట్ కేర్ సెంటర్‌లో డాక్టర్ రమాకాంత్ పాండే ఆధ్వర్యంలో దాదాపు 8 గంటల పాటు బైపాస్ సర్జరీ జరిగింది. ఆపరేషన్ తర్వాత మూడు రోజుల పాటు ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. కోలుకున్న తర్వాత ఆయన హైదరాబాద్‌కు తిరిగి వచ్చారు. కొడాలి నాని ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పార్టీ నేతలు తెలిపారు.వైద్యుల సూచన మేరకు ఎవరినీ కలవడం లేదు. మెరుగైన చికిత్స కోసం ఆయన అమెరికా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. గతంలోనే ఈ ఆలోచన చేసినప్పటికీ, ఆపరేషన్ తర్వాత కొంతకాలం ఆగి వెళ్లాలని వైద్యులు సూచించారు. అందుకే ఇప్పుడు అమెరికా వెళ్లడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. పార్టీ నేతలు ఆయన ఆరోగ్యం గురించి మాట్లాడుతూ, 'నాని ఆరోగ్యం నిలకడగా ఉంది. ఎలాంటి ఆందోళన అవసరం లేదు" అని స్పష్టం చేశారు అయితే, అమెరికాకు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందనే అనుమానం ఆయన అభిమానులు వ్యక్తం చేస్తునారు.

## మిర్చి మాటున గంజాయి...

**ఒంగోలు, మే 19, పెన్ పవర్:** ప్రకాశం జిల్లాలో మిర్చి పంటల మాటున గంజాయి సాగు చేస్తున్న ముఠా గుట్టు రట్టయింది. పుల్లలచెరువు మండలం అయ్యవారిపల్లెలో ఓ వ్యక్తి తన మిరప తోటలో గంజాయి సాగు చేస్తున్నాడు. ఈ విషయం తెలిసి పోలీసులు దాడులు చేయగా.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. అయితే అదే గ్రామంలో మరో వ్యక్తి వద్ద కూడా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు త్రిపురాంతకం మండలం మేడిపిలో గంజాయి విక్రయిస్తున్న కొందరిని అరెస్ట్ చేసి 1.5 కిలోలకు పైగా గంజాయి, 2 వాహనాలు, ఫోన్లు పట్టుకున్నారుఅది ఒక మిర్చి తోట. పైకి చూడగానే అలాగే కనిపిస్తుంది. కానీ ఆ మిర్చి తోట లోపలికి వెళ్తేనే అసలు సంగతి తెలుస్తుంది. ఎందుకంటే ఆ మిర్చి తోటను పండించే వ్యక్తి రైతు ముసుగులో ఉన్న ఓ గంజాయి వ్యాపారి. మిర్చి పంటను పండించే నెపంతో.. ఎవరికీ తెలియకుండా చెట్ల మధ్యలో గంజాయి మొక్కలను కూడా పెంచుతున్నాడు. అయితే ఈ విషయం కాస్తా ఎక్సైజ్ పోలీసుల వరకు చేరింది. దీంతో రంగంలోకి దిగిన ఎక్సైజ్ పోలీసులు.. ఆ మిర్చి తోటలో గాలింపు చేపట్టి గంజాయి మొక్కలను గుర్తించారు. గంజాయి సాగు విషయం బయటికి రావడంతో దాన్ని పండిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారుప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలంలోని అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన పోలుబోయిన చిన్న సుబ్బారావు అనే రైతు మిరప తోట పెంచుతున్నాడు. అయితే అందులో ఎవరికీ తెలియకుండా 5 గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. అయితే ఈ గంజాయి సాగు బయటికి రావడానికి మరో సంఘటన జరిగింది. అదే అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన ఈపూరి గురవయ్య అనే వ్యక్తి వద్ద 150 గ్రాముల గంజాయి ఉండగా.. స్వయంగా ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడ్ని విచారణ జరిపిన ఎక్సైజ్ పోలీసులు.. ఆ గంజాయి ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్నించగా.. అసలు విషయం చెప్పేశాడు. పోలుబోయిన చిన్న సుబ్బారావు తన మిరప తోటలో గంజాయి సాగు చేస్తున్నాడని సమాచారం ఇవ్వడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.మరో సంఘటనలో త్రిపురాంతకం మండలం మేడిపి గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న కొందరిని ఎక్సైజ్ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. మలై పోగు సాగర్ బాబు వద్ద నుంచి 450 గ్రాముల గంజాయిని.. మాట చిన్న చంద్రయ్య వద్ద నుంచి 750 గ్రాముల గంజాయిని.. యద్దనపూడి హైజాక్ వద్ద నుంచి 350 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మొత్తం గంజాయి 1.50 కిలోలకు పైగానే ఉంటుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.మరోవైపు.. ఈ గంజాయి దాడుల్లో నిందితులకు చెందిన 2 ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్‌లను కూడా ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒంగోలు, ఎర్రగొండపాలెం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది ఈ గంజాయి నిందితులను పట్టుకునేందుకు చేసిన దాడుల్లో పాల్గొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులు వివరించారు. తాజాగా మిర్చి పంటలో గంజాయి సాగు చేస్తున్న నిందితులు దొరకడంతో.. ఎక్సైజ్ శాఖ నిఘా పెంచి.. అన్ని పంటల్లో తనిఖీలు చేయనుంది.

# మట్టిపై మరో స్పెయిన్ యోధుడు.. రోమ్ మాస్టర్స్ టైటిల్ గెలుచుకున్న అల్కరాజ్



**హైదరాబాద్ పెన్ పవర్:** క్లే కోర్ట్ అంటే రఫెల్ నాదల్. స్పెయిన్ కు చెందిన నాదల్ రెండు దశాబ్దాలుగా తన ఆధిపత్యాన్ని చూపించాడు. ఏకంగా 14 సార్లు ఫ్రెంచ్ ఓపెన్ గెలిచాడు. నాదల్ టెన్నిస్ కెరీర్ కు రిటైర్మెంట్ ప్రకటించడంతో అతని స్థానంలో మరో స్పెయిన్ వీరుడు మట్టి కోర్ట్ లో తన తడాఖా చూపిస్తున్నాడు. నాదల్ తర్వాత తనదే క్లే అన్నట్టు చెలరేగిపోతున్నారు. అతనెవరో కాదు ప్రపంచ రెండో ర్యాంకర్ కార్లోస్ అల్కరాజ్. గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ గెలుచుకున్న ఈ స్పెయిన్ వీరుడు ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ కు ముందు జరిగిన రోమ్ మాస్టర్స్ 1000 టైటిల్ గెలుచుకున్నాడు.

ఆదివారం (మే 18) సిన్నర్ తో జరిగిన రోమ్ మాస్టర్స్ ఫైనల్లో సిన్నర్ ను అల్కరాజ్ వరుస సెట్లలో ఓడించాడు. ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో అల్కరాజ్ 7-6 (7/5), 6-1 తేడాతో ప్రపంచ నంబర్ వన్ సిన్నర్‌పై గెలిచాడు. మరోవైపు 1976లో అడ్రియానో ??పనట్టా తర్వాత ఇటాలియన్ టోర్నమెంట్ గెలుచుకొని చరిత్ర సృష్టిద్దామనుకున్న సిన్నర్ కు ఫైనల్లో నిరాశే ఎదురైంది. అంతేకాదు సిన్నర్ వరుసగా 26 విజయాలకు అల్కరాజ్ బ్రేక్ వేశాడు. ఈ విజయంతో అల్కరాజ్ ఏటీపీ ర్యాంకింగ్స్ లో రెండో స్థానానికి చేరుకున్నాడు.

**తొలి సెట్ లోనే పోటీ:**

టాప్ సీడ్స్ మధ్య మ్యాచ్ జరగడంతో ఈ మ్యాచ్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అనుకున్నట్టుగానే ఇద్దరూ తొలి సెట్ లో నువ్వా నేనీ అన్నట్టుగా ఆడారు. 12 గేమ్ లో సిన్నర్ కు రెండు సెట్ పాయింట్స్ అవకాశం వచ్చినా అల్కరాజ్ అద్భుతంగా ఆడి గేమ్ నిలబెట్టుకొని టై బ్రేకర్ కు తీసుకెళ్లాడు. టై బ్రేక్ లో కూడా 5-5 తో సమంగా నిలిచారు. అయితే కీలక దశలో అల్కరాజ్ సిన్నర్ పై ఆధిపత్యం చూపించి తొలి సెట్ ను కైవసం చేసుకున్నాడు. రెండో సెట్ లో అల్కరాజ్ ధాటికి సిన్నర్ పూర్తిగా చేతులెత్తేశాడు. 6-1 తేడాతో సిన్నర్ ను చిత్తుగా ఓడించి రెండో సెట్ తో పాటు మ్యాచ్ గెలిచాడు.

# నా పేరెంట్స్ ఉండే ప్రదేశానికి దగ్గర్లోనే బాంబు దాడులు జరిగాయి: కేకేఆర్ ఆల్ రౌండర్ ఆవేదన



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025 నుంచి ఇంగ్లాండ్ స్పిన్ ఆల్ రౌండర్ మొయిన్ అలీ వైదొలిగాడు. కోల్ కతా నైట్ రైడర్స్ తరపున ఆడుతున్న మొయిన్ అలీ కారణం చెప్పకుండానే ఈ మెగా టోర్నీ నుంచి తప్పుకున్నాడు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన తర్వాత ఐపీఎల్ 8 రోజుల పాటు వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో తాను ఐపీఎల్ లోని మిగిలిన మ్యాచ్ లకు ఇండియాకి తిరిగి రావడం లేదని షాక్ ఇచ్చాడు. మొయిన్ అలీ ఇంగ్లాండ్ జట్టులో లేకపోయినా.. ప్రస్తుతం ప్రపంచ లీగ్ ల్లో ఈ ఆల్ రౌండర్ ఆడకపోయినా ఐపీఎల్ నుంచి ఎందుకు వైదొలిగాడో తెలియలేదు.

కేకేఆర్ యాజమాన్యం కూడా మొయిన్ అలీ విషయంలో ఎలాంటి ప్రకటన చేయలేదు. తాజాగా మొయిన్ అసలు విషయం బయట పెట్టాడు. తాను ఐపీఎల్ 2025 నుంచి ఎందుకు తప్పుకున్నాడో వివరణ ఇచ్చాడు. ఇండియా, పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు కారణంగా టోర్నమెంట్ నుండి ముందుగానే నిష్క్రమించవలసి వచ్చిందని.. ఆపరేషన్ సిందూర్ జరిగినప్పుడు తన తల్లిదండ్రులు పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)లో ఉన్నారని వెల్లడించాడు.

మొయిన్ మాట్లాడుతూ ఇలా అన్నాడు.. " ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తల పరిస్థితులు నెలకొన్నాయి. దాడులు జరిగేటప్పుడు నా పేరెంట్స్ పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్ లో ఉన్నారు.నా పేరెంట్స్ ఉండే ప్రదేశానికి దగ్గర్లోనే బాంబు దాడులు జరిగాయి. కొద్ది రోజుల్లోనే పరిస్థితులు తీవ్రంగా మారాయి. యుద్ధంలో చిక్కుకున్నామని వాళ్లకి అర్థమైంది. అదృష్టవశాత్తు వాళ్లున్న ప్రాంతంలో బాంబు దాడులు జరగలేదు. వెంటనే విమానం ఎక్కి పీఓకే నుంచి వాళ్లు సేఫ్‌గా రావడంతో నేను ఊపిరి పీల్చుకున్నా" అని బియర్డ్ బిఫోర్ వికెట్ పాడ్‌కాస్ట్‌లో మొయిన్ తెలిపాడు.

# ప్లే ఆఫ్స్‌కు సౌతాఫ్రికా పేసర్ ఔట్.. జింబాబ్వే ఫాస్ట్ బౌలర్‌తో RCB ఒప్పందం



**హైదరాబాద్ పెన్ పవర్:**ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కీలక రీప్లేక్ మెంట్ ప్రకటించింది. సౌతాఫ్రికా ఫాస్ట్ బౌలర్ లుంగీ ఎంగిడి స్థానంలో జింబాబ్వే పేసర్ బ్లెస్సింగ్ ముజారబానీని జట్టులోకి తీసుకుంది. సోమవారం (మే 19) %=జదీ% యాజమాన్యం లుంగీ ఎంగిడి స్థానంలో ముజారబానీతో ఒప్పందం చేసుకోనున్నట్టు అధికారికంగా ప్రకటించింది. రూ.75 లక్షలకు ముజారబానీ ఆర్సీబీ జట్టులో చేరనున్నాడు. ఐపీఎల్ 2025 ప్లే ఆఫ్స్ కు ఎంగిడి అందుబాటులో ఉండడం లేదు. ఆస్ట్రేలియాతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఉండడంతో ఎంగిడి లీగ్ మ్యాచ్ ల వరకు అందుబాటులో ఉండనున్నాడు. ముజారబానీ ప్రస్తుతం సూపర్ ఫామ్ లో ఉన్నాడు. ఈ కుడిచేతి వాటం పేసర్ ఇటీవలే బంగ్లాదేశ్ తో జరిగిన తొలి టెస్ట్ లో అద్భుతంగా బౌలింగ్ చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. ఇప్పటివరకు జింబాబ్వే తరపున 70 టీ20లు మ్యాచ్ లు ఆడి 78 వికెట్లు పడగొట్టాడు. ప్రపంచ టీ20 లీగ్ ల్లో ఎన్నో మ్యాచ్ లు ఆడిన ఈ జింబాబ్వే పేసర్ కు ఇదే తొలి ఐపీఎల్ సీజన్ కావడం విశేషం. 6.8 అడుగుల ఎత్తు ఉన్న ముజారబానీ స్లో బంతులతో పాటు యార్కర్లు వేయడంలో దిట్ట. ఇటీవలే బీసీసీఐ తాత్కాలిక రీప్లేస్ మెంట్ లు చేసుకోమనడంతో ఆర్సీబీ చేసుకున్న తొలి రీప్లేస్ మెంట్ ఇదే. ఎంగిడితో పాటు ఇంగ్లాండ్ ఆల్ రౌండర్ జాకబ్ బెతేల్ స్వదేశానికి వెళ్లనున్నాడు. వెస్టిండీస్ తో వన్డే సిరీస్ ఉండడంతో ఈ ఇంగ్లాండ్ ఆల్ రౌండర్ ప్లే ఆఫ్స్ వరకు మాత్రమే అందుబాటులో ఉండనున్నారు. బెతేల్ కు త్వరలో రీప్లేక్ మెంట్ ప్రకటించే అవకాశం ఉంది. వీరిద్దరూ మినహాయిస్తే మిగిలిన అందరూ ఆర్సీబీకి అందుబాటు లో ఉంటారు.ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించింది. ఆదివారం (మే 18) ఢిల్లీ క్యాపిటల్స్ పై గుజరాత్ టైటాన్స్ ఘన విజయం సాధించడంతో ఆర్సీబీ ప్లే ఆఫ్స్ బెర్త్ కన్ఫర్మ్ చేసుకుంది. దీంతో వరుసగా రెండో సారి ఐపీఎల్ లో ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించిన ఏకైక జట్టుగా నిలిచింది. ప్రస్తుతం పటిదార్ నేతృత్వంలోని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 12 మ్యాచ్ ల్లో 17 పాయింట్లతో పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉంది. ఆర్సీబీ మరో రెండు మ్యాచ్ లు ఆడాల్సి ఉంది. ఇప్పటికే ప్లే ఆఫ్స్ కు అర్హత సాధించిన పటిదార్ సేన మిగిలిన రెండు మ్యాచ్ ల్లో గెలిస్తే టాప్ 2 లో నిలుస్తుంది. అప్పుడు ఫైనల్ చేరడానికి రెండు అవకాశాలు ఉంటాయి. మే 23 న సన్ రైజర్స్ హైదరాబాద్‌తో.. మే 27 న లక్నో సూపర్ జయింట్స్‌తో తలపడనుంది.


# త్రిష కి చెక్ పెట్టేందుకు రెడీనా..?



**హీర్ అచ్రా: చిక్ స్టైల్‌తో అప్రయత్నంగా ప్రకాశిస్తుంది**

కోలీవుడ్ లో ఇద్దరి హీరోయిన్స్ మధ్య టఫ్ ఫైట్ నడుస్తుంది. అది ఎవరన్నది కనిపెట్టడం పెద్ద కష్టమేమి కాదు ఒకరు లేడీ సూపర్ స్టార్ ఇమేజ్ తో ఫిమేల్ సెంట్రిక్ సినిమాలతో అదరగొడుతుంటే మరొకరు కమర్షియల్ సినిమాలు చేస్తూ అడపాదడపా సోలో సినిమాలు చేస్తూ ఆడియన్స్ మెప్పు పొందుతున్నారు. ఇద్దరి కెరీర్ రెండు దశాబ్దాలుగా కొనసాగుతున్నా ఇప్పటికీ ఇద్దరికీ అక్కడ మంచి ఫాలోయింగ్ ఉంది. ఐతే ఇప్పుడు ఆ ఇద్దరు తెలుగు సినిమాల మీద స్పెషల్ ఫోకస్ పెట్టారు.ఇంతకీ ఎవరా ఇద్దరు ఏంటా కథ అంటే ఈ మ్యాటర్ పూర్తిగా తెలుసుకోవాల్సిందే. తమిళ్ లో స్టార్ హీరోయిన్స్ గా కొనసాగుతున్న నయనతార, త్రిషల మధ్య టఫ్ ఫైట్ నడుస్తుంది. మొన్నటిదాకా ప్రతి స్టార్ సినిమాలో నయనతార కామన్ హీరోయిన్ అయ్యేది ఐతే ఇప్పుడు ఆ ఛాన్స్ త్రిష తీసుకుం టుంది. %్జా.నా% 1, 2 సినిమాలు చేశాక త్రిషకు మరిన్ని ఆఫర్లు వస్తున్నాయి. కోలీవుడ్ లో త్రిష సినిమా సినిమాకు తన ఫాం ని మెరుగుపరచుకుంటుంది.నయనతార కూడా అక్కడ తన పంథాలో సినిమాలు చేస్తూ వెళ్తుంది. ఐతే త్రిష ఆఫ్టర్ లాంగ్ టైం తెలుగులో విశ్వంభర సినిమా చేస్తుంది. మెగాస్టార్ చిరంజీవితో సినిమా కాబట్టి అందరి ఫోకస్ ఆ సినిమా మీద ఉంది. ఇదే కాదు త్రిష నెక్స్ట్ రెండు తెలుగు సినిమాలు డిస్కషన్ స్టేజ్ లో ఉన్నాయని టాక్. ఐతే ఈ టైం లో త్రిష తెలుగు సినిమాలకు చెక్ పెట్టేలా చూస్తుంది నయనతార. ఇన్నాళ్లు తమిళ్ లో బిజీగా ఉండి టాలీవుడ్ ఆఫర్లు కాదన్న నయనతార ఇప్పుడు మళ్లీ తెలుగు సినిమాలకు సైన్ చేస్తుంది.

మెగాస్టార్ చిరంజీవి అనిల్ రావిపూడి కాంబో సినిమాలో నయనతార నటిస్తుంది. ఆమె సినిమాలో నటిస్తుందన్న ఆన్ బోర్డ్ వీడియో చేసి సర్ ప్రైజ్ చేసింది. ఐతే త్రిష ఇప్పుడు తన ఫోకస్ టాలీవుడ్ మీద పెట్టగా ఇక్కడ ఆమె ఛాన్స్ లను కాజేయాలని చూస్తుంది నయనతార. ఇద్దరు చిరంజీవి సినిమాతోనే తెలుగు రీ ఎంట్రీ ఇవ్వడం విశేషం. త్రిష తప్పకుండా ఇంకా ఛాన్స్ లు రాబట్టుకునేలా ఉంది. నయనతార కూడా మెగా 157 చేస్తే తప్పకుండా మరిన్ని అవకాశాలు దక్కించుకునేలా ఉంది.



**కొచ్చి ఐలాండ్ లైఫ్‌కి మాళవిక మోహనన్ హృదయపూర్వక నివాళి**



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com